# మణిపూర్:
# ఎందుకింత ఆగ్రహం!






మానవహక్కుల వేదిక (HRF)
ప్రచురణ

మణిపూర్:

# ఎందుకింత ఆగ్రహం?

మానవహక్కుల (HRF) వేదిక ప్రచురణ



**మణిపూర్‌లో ఇటువంటి దృశ్యాలెన్నో....**
**అందుకే సైన్యంపై వారికంత కోపం...**

# ముందుమాట

**సా**యుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేయాలని మణిపూర్‌లో సాగుతున్న ఆందో ళన పూర్వాప రాలు తెలుసుకునే ఉద్దేశ్యంతో ఏడుగురు సభ్యులు గల మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ దసరా పండగ దినాలలో మణిపూర్‌కు వెళ్లింది. సుదీర్ఘమైన ప్రయాణం కారణంగా మణిపూర్‌లో ఎక్కువ సమయం గడపలేకపోయి నప్పటికీ సాధ్యమయినంత సమాచారం సేకరించాము. అక్కడి ప్రజల ఆందోళనను, దాని నేపథ్యాన్ని అర్థం చేసు కొని వారికి సంఘీభావం తెలపడానికి ఉపయోగపడుతుం దన్న ఆశతో ఈ నివేదికను తెలుగు పాఠకుల ముందు ఉంచుతున్నాం.

**–మానవహక్కుల వేదిక**

డిసెంబర్ 10, 2004

## మణిపూర్: ఎందుకింత ఆగ్రహం?


- ప్రచురణ సంఖ్య: 11
- ప్రచురణ కాలం : డిసెంబర్ 2004
- కాపీలు : 2000 । వెల : 5 రూపాయలు
- ముద్రణ : నవ్య ప్రింటర్స్

ప్రతులకు:

**ఎస్.జీవన్ కుమార్**

3-12-117/ఎ-2/1, పి.ఎన్.కాలనీ,

గణేష్‌నగర్, రామంతాపూర్

హైదరాబాద్-13. ఫోన్: 27039519

**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్‌హౌస్‌లు**

# పరిచయం

ఈశాన్య భారతం అని మనం మామూలుగా పిలిచే ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలలో మణిపూర్ ఒకటి. ఆ ఏడు రాష్ట్రాలలో మణిపూర్, త్రిపురలు మాత్రమే వలసపాలన కాలంలోనయినా, ఆ తరువాతయినా 'అస్సాం'లో భాగం కాదు. నాగాలాండ్, మిజోరం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లు మాత్రం 'అస్సాం' అనే రాష్ట్రంలో భాగంగా ఉండి 1972 తరువాత వేరు రాష్ట్రాలయ్యాయి. మణిపూర్, త్రిపురలు మాత్రం ఎప్పుడూ వేరుగానే ఉన్నాయి.

ఈ ఏడు రాష్ట్రాలలో మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్‌లను మినహాయిస్తే తక్కిన అయిదూ వివిధ స్థాయిలలో సాయుధ పోరాట రాజకీయాలకు నిలయంగా ఉన్నాయి. కాశ్మీర్ అంతగా ఈ రాష్ట్రాలు వార్తలలో లేకున్నప్పటికీ ఇక్కడి సాయుధ సంస్థల బలం తక్కువేమీ కాదు. 'పోటా' చట్టంలో పార్లమెంటు 'టెర్రరిస్టు సంస్థలు'గా గుర్తించిన 25 సంస్థలలో 10 ఈశాన్య భారతానికి చెందినవి. నాగాలాండ్‌కు చెందిన మిలిటెంట్ సంస్థలతో ఏడేళ్లగా కాల్పుల విరమణ అమలవుతున్న కారణంగా నాగాజాతి పోరాట సంస్థలను 'పోటా'లో చేర్చలేదుగానీ చేర్చివుంటే దేశంలోని 'టెర్రరిస్టు' సంస్థలలో సగం ఈశాన్య భారతానికి చెందినవే ఉండేవి.

హింస పరిమాణంలో మణిపూర్‌లోని పోరాట సంస్థలు త్రిపుర, బోడో సంస్థలతో పోలికకు రావు. తమ పట్టుదలతో భారత ప్రభుత్వాన్ని చర్చలకు లాగిన మొండితనంలో నాగా సంస్థలతో పోలికకు రావు. అయితే సంఖ్యరీత్యా ఎక్కువ సంస్థలు మణిపూర్‌కు చెందినవే. 'పోటా'లో టెర్రరిస్టు సంస్థలుగా పేర్కొన్న పది ఈశాన్య భారత సంస్థలలో ఆరు మణిపూర్‌కు చెందినవే. వాటిలో ఒకటయిన యునై టెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ మొత్తం ఈశాన్య భారతంలోని మిలిటెంట్ సంస్థలన్నిటిలోకీ సుశిక్షితమైనదిగా పేరు పొందింది.

ఈ పోరాట సంస్థలకు ఏం కావాలి? అవి దేనికోసం పోరాడుతున్నాయి?

తమ జాతి, లేక తెగ, లేక భూభాగం ఉనికి కోసం, అస్తిత్వం కోసం తమ ప్రజల స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నట్టు ఈ సంస్థలన్నీ చెప్పుకుంటాయి. తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకునే స్వేచ్ఛ కోసం పోరాడుతున్నామంటాయి. ఈశాన్య భారతంలోని ఒక్కొక్క రాష్ట్రంలోనూ ఈ కోరిక వెనుక ఒక్కొక్క చరిత్ర ఉంది. కొంచెం ఓపికగా విన్నట్టయితే వారి

కోరిక అర్థవంతంగా తోచక మానదుగానీ భారత జాతీయతాభావనలోనూ భారత రాజ్యాంగం లోనూ దానికి చోటు లేదు. ఇది ఆ ప్రజల పాలిట శాపంగా పరిణమించింది. ఒక రాజకీయ ఆకాంక్ష శాంతంగా బతికి బట్టకట్టాలంటే దాని సాధనకు కాకపోయినా కనీసం దాని వ్యక్తీకర ణకు రాజ్యాంగంలో చోటు ఉండాలి, దేశం తన గురించి తాను చేసుకునే భావనలో చోటుం డాలి. ఇవి రెండూ లేనట్టయితే ఆ ఆకాంక్ష మరుగున పడిపోవడమో లేకపోతే ప్రశాసనంతో ముఖాముఖి తలపడడమో జరుగుతుంది. ఉదాహరణకు దేశ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉం డాలి అన్న కోరిక తీసుకోండి. అది ఇప్పట్లో తీరడం కష్టం. అయితే భారత రాజ్యాంగం దాని నొక హక్కుగా గుర్తించనప్పటికీ ఆ కోరికకు అం దులో చోటు ఉంది. భారతీయత లేక భారత దేశ భక్తి అనే సగటు భావనలో ప్రజల ఆరోగ్యం ప్రధాన అంశం కాకపోయినప్పటికీ దానికిది విరుద్ధం కాదు. కాబట్టి ఆ కోరిక వ్యక్తీకరణకూ వ్యాప్తికీ ఏమంత ఇబ్బంది ఉండదు.

అయితే అన్ని కోరికలూ అటువంటివి కావు. దేశం లోపలి ఒక జాతి లేక ఒక ప్రజ స్వయం నిర్ణయాధికారాన్ని కోరుకోవడం ఒక ఉదాహరణ. ఆ కోరికకు అంతర్జాతీయ చట్టంలో ప్రముఖ స్థానమే ఉంది. ఐక్యరాజ్య సమితి రూపకల్పన చేసిన అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడం బడికలోని మొదటి ఆర్టికల్ 'స్వయం నిర్ణయాధికారం అన్ని ప్రజా సమూహాల హక్కు' అని ప్రకటించింది. అంటే అర్థమేమిటో కూడా విశదీకరించింది. 'తమ రాజకీయ స్థితిగతులను (ఇంగ్లీష్ లో 'స్టేటస్') స్వేచ్ఛగా నిర్ణయించుకునే హక్కు, తమ ఆర్థిక సామాజిక సాంస్కృతిక పురోగమనాన్ని స్వేచ్ఛగా ఆవిష్కరించుకునే హక్కు' అన్ని ప్రజా సమూహాలూ కలిగి ఉంటాయని వివరించింది.

అయితే భారత రాజ్యాంగంలో ఈ హక్కుకు చోటులేదు. భారత రాజ్యాంగం తన ఎల్లలను ప్రకటించుకొని పుట్టింది. వాటిని పెంచుకునే అవకాశం రాజ్యాంగంలోని ఆర్టికల్ 2 ఇచ్చింది. పార్లమెంటు ఒక చట్టం ద్వారా భారత్‌లో భాగం కావడానికి సిద్ధంగా ఉన్న విదేశీ భూభాగాన్ని చేర్చుకోవచ్చు. కానీ దేశం ఎల్లలుగా ప్రకటించుకున్న వాటికి లోపల ఉన్న ప్రజా సమూహానికి స్వాతంత్ర్యం కోరుకునే అవకాశం, ఇచ్చే అవకాశం రాజ్యాంగంలో లేవు.

దేశం ఎల్లలుగా రాజ్యాంగం ప్రకటించినది చారిత్రకంగా స్థిరపడినది అయివుంటే అదొక రకం. కానీ భారతదేశ అధికారిక సరిహద్దు అటువంటిది కాదు. అది అశోకుడి సామ్రాజ్యపు హద్దూ కాదు, అక్బర్ సామ్రాజ్యపు హద్దూ కాదు. (వాళ్లిద్దరి కంటే ఎక్కువ భూభాగాన్ని పరిపా లించిన వారె వ్వరూ లేరు). మన దేశ సరిహద్దుగా మనం భావించే ఎల్లల రూపకల్పన బ్రిటిష్ వలస పాలనలో జరిగిందనే చేదు వాస్తవాన్ని భారతీయులు ఒప్పుకోవడానికి సిద్ధపడితే ఆ సరిహద్దులను సవాలు చేస్తున్న వారి పట్ల వ్యతిరేకత కొంత తగ్గుతుందేమో.

బ్రిటిష్ వాళ్లు భారత్ సరిహద్దుల్ని నిర్ధారించాలనీ స్థిరీకరించాలనీ ప్రత్యేకించి కోరుకోలేదు. వారిదొక ప్రపంచవ్యాప్త సామ్రాజ్యం. దానిలో అంతర్గత సరిహద్దులనూ, దాని భూభాగానికీ

దాని వెలుపల ఉన్న భూభాగానికీ మధ్యనున్న సరిహద్దులనూ ఎప్పటికప్పుడు పాలనావసరాలనూ, సామ్రాజ్య భద్రతనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయిస్తూ ఉండేవారు. అవే వలస దేశాల స్వాతంత్ర్యానంతరం దేశాల ఎల్లలయ్యాయి. దాని చుట్టూ దేశ భక్తి భావన అల్లుకునింది. భారతదేశ భక్తి తన స్వీయ నిర్వచనానికి వేదాలనూ, ఉపనిషత్తులనూ ఆశ్రయిస్తుండవచ్చును గానీ అది తన భూభాగంగా భావించే నేల ఎల్లలు పరాయి పాలకులు తమ సౌలభ్యార్థం స్పష్టాస్పష్టంగా ఏర్పరచినవి. కానీ ఆ ఎల్లల చారిత్రకతను ప్రశ్నించే హక్కు వాటి సమీపంలో నివసించే ప్రజలకు మన రాజ్యాంగమూ ఇవ్వలేదు, దేశభక్తి అనే ప్రధాన స్రవంతి భావనా ఇవ్వలేదు. దేశ ఉత్తర, ఈశాన్య సరిహద్దు వద్ద నున్న అలజడికి చారిత్రక మూలం స్థూలంగా ఇది. దక్షిణాన సముద్రమే సరిహద్దు కాకపోతే, వాయవ్య ప్రాంతం పాకిస్తాన్‌గా రూపాంతరం చెందకపోతే దేశం చుట్టూ ఇటువంటి అలజడే ఉండేదేమో!

## మణిపూర్: కొంచెం చరిత్ర

మణిపూర్ చుట్టూ కొండలూ మధ్యన లోయ ఉన్న సుందరమైన ప్రాంతం. వైశాల్యంలో చిన్నదైన లోయ ప్రాంతంలో జనాభా ఎక్కువ. వైశాల్యం అధికమైన కొండ ప్రాంతాలలో జనాభా తక్కువ. లోయలో ప్రధానంగా నివసించేది హిందువులుగా మారిన గిరిజనేతర మీయ్‌తీలు కాగా, కొండలలో ఉండేది క్రైస్తవం పుచ్చుకున్న నాగా, కుకీ తెగలు.

మణిపూర్ వైశాల్యం 22,327 చ.కి.మీ.లు కాగా అందులో కొండ ప్రాంతం వైశాల్యం 20,089 చ.కి.మీ.లు. అయితే మొత్తం రాష్ట్రం జనాభా (1991 లెక్కల ప్రకారం) 18,37,149. కాగా అందులో కొండ ప్రాంతం జనాభా 6,51,157 మాత్రమే. అంటే కేవలం 11.14 శాతం వైశాల్యం ఉన్న లోయలో 64.55 శాతం జనాభా నివసిస్తున్నారు.

మణిపురీ జాతి పేరుమీద నడుస్తున్న పోరాటం లోయ ప్రాంతానికి చెందినది. వీరు ప్రధానంగా మీయ్‌తీలు. కొండ ప్రాంతాలలో నివసించే వారిలో నాగా తెగలకు చెందిన వారు మణిపూర్ జాతి పోరాటంలో కాక పొరుగున ఉన్న నాగాలాండ్ ప్రజలతో పాటు నాగాజాతి పోరాటంలో భాగమవుతారు. దీనివల్ల వచ్చిన వైరుధ్యం రాబోయే రోజులలో తీవ్రరూపం తీసుకోగలదు కానీ దాని గురించి వివరంగా చెప్పుకోవడానికిది సందర్భం కాదు. ప్రస్తుతం మణిపురీ జాతి పోరాటాన్ని గురించి, దాని పూర్వాపరాల గురించి చూద్దాం.

ఈశాన్య భారతంలో వేరే ఏ ప్రజల చరిత్ర చెప్పుకున్నా అందులో బెంగాల్ ప్రస్తావన, అస్సాం ప్రస్తావన దండిగా వస్తుంది. ఎందుకంటే బ్రిటిష్ పాలకులు తమ ప్రత్యక్ష పాలనలో ఉన్న ఈశాన్య భారత ప్రాంతాన్నంతా తొలుత బెంగాల్ రాష్ట్రంలో భాగంగాను, 1874లో అస్సాం రాష్ట్రాన్ని ఏర్పాటుచేసిన తరువాత అస్సాం రాష్ట్రంలో భాగంగాను పరిపాలించారు. అందుకే స్వాతంత్ర్యానంత రం ఆ ప్రాంతాలన్నీ అస్సాంలో భాగంగా ఉండి, అక్కడ మొదలయిన

అస్తిత్వ పోరాటాలకు మొదటి ఫలితంగా వేరే రాష్ట్రాలయ్యాయి. మణిపూర్‌ను బ్రిటిష్ వాళ్లు ప్రత్యక్షంగా ఎప్పుడూ పరిపాలించలేదు కాబట్టి అది ఎన్నడూ బెంగాల్‌లో గానీ, అస్సాంలో గానీ భాగంగా లేదు. 1947 తరువాత విడిగానే ఒక రాష్ట్రంగా భారత్‌లో కలుపుకోబడింది.

మణిపూర్‌కు ఒక రాజ్యంగా దాదాపు 2000 సంవత్సరాల చరిత్ర ఉంది. రాజాస్థాన చరిత్రకారుల కథనాలను ఆధారం చేసుకొని ఈ చరిత్ర తెలుసుకోవచ్చు. క్రీ.శ. 33 నుండి ఇది మొదలవుతుంది. 11వ శతాబ్దంలోనే మణిపూర్ రాజు లోయింబా లిఖిత రాజ్యాంగాన్ని ప్రకటించాడు. ఆ రాజ్యాంగం 1891 దాకా అమలులో ఉండింది.

బెంగాల్, అస్సాంల ప్రస్తావన రాదుగానీ మణిపూర్ చరిత్రలో బర్మా ప్రస్తావన చాలానే వస్తుంది. నైసర్గికంగా చూసినప్పుడు మణిపూర్‌కు భారత్‌తో కంటే బర్మా (ప్రస్తుత మయన్మార్) తోనే సన్నిహిత సంబంధం. ఇటు భారత్ నుండి అటు మయన్మార్ నుండి దాడులను ఎదుర్కుంటూ తమ అస్తిత్వాన్ని తాము 1947 దాకా కాపాడుకున్నామనేది మణిపురీలు తమ గురించి తాము చెప్పుకునే విషయం. మణిపూర్ తూర్పు సరిహద్దున ఉన్నది మయన్మార్ కాగా, దక్షిణం నుండి పడమటి దాకా మయన్మార్ భూభాగం, మిజో తెగలు నివసించే లూషాయి కొండలు, అస్సాంలో ఉన్నప్పటికీ అధికంగా బెంగాలీ లు నివసించే కచార్ జిల్లా ఉన్నాయి. ఉత్తరాన ఉన్నది నాగాలాండ్. వీటిలో ఇది నిర్ద్వంద్వంగా ఇండియా అని చెప్పగలిగింది ఒక కచార్ జిల్లాయే కావచ్చు.

అయితే బెంగాల్ నుండి వైష్ణవ మతం మాత్రం 18వ శతాబ్దం నాటికి మణిపూర్‌కు వ్యాపించింది. మీయ్‌తీలు వైష్ణవులయ్యారు. కుల వ్యవస్థ కూడా అంకురించింది. ఆహార పానీయాల విషయంలో సంప్రదాయక మీయ్‌తీ ఆచారాలు ఇంకా పాటించే చక్పాలను అంటరానివారిగా భావిస్తారు. 18వ శతాబ్దపు ప్రథమార్ధంలో మణిపూర్‌ను పరిపాలించిన పమ్‌హీయ్‌బా అనే రాజు వైష్ణవం స్వీకరించడమే కాక వైష్ణవాన్ని మణిపూర్‌లో అధికార మతం చేశాడు. కానీ అది మణిపూర్ లోయ ప్రాంతంలో నివసించే మీయ్‌తీలకే పరిమితమయింది. కొండలలో నివసించే నాగా, కుకీ తెగలు తమ సంప్రదాయ విశ్వాసాలను వదలలేదు. 19వ శతాబ్దంలో బాప్టిస్టు ప్రచార కుల ప్రభావం వల్ల వారు క్రైస్తవులయ్యారు.



ప్రతి మీయ్‌తీ ఇంటిముందు
ఇలాంటి తులసికోట ఉంటుంది

బెంగాల్ నుండి మణిపురీలకు వైష్ణవ మతంతో పాటు బెంగాలీ లిపి కూడా సంక్రమించింది. మణిపురీ భాష బెంగాలీకి చాలా భిన్నమైనది. దాని అసలు పేరు మీయ్‌తీలాన్. వైష్ణవం ద్వారా వచ్చిన సంస్కృతీకరణలో భాగంగా దానిపేరు మణిపురీగా మారింది.

కానీ భాష మాత్రం భారతీయ భాషల కన్నా మయన్మార్, మలయా, థాయ్ లాండ్ మొదలయిన ఆగ్నేయాసియా దేశాల భాషలకు సన్నిహితమైనది. కానీ లిపిగా బెంగాలీ లిపి స్థిరపడిపోయింది. అంతకు ముందున్న మీయ్‌తీలాన్ లిపిని ఇప్పుడిప్పుడే పునరుద్ధరించే ప్రయత్నం జరుగుతున్నది. మణిపూర్ లోని ప్రభుత్వ కార్యాలయాల బయట ఉండే బోర్డుల మీద కార్యాలయం పేరు మణిపురీ లిపిలో రాసి ఉంటుంది. దానికింద అదే పేరు, ఇతర వివరాలు బెంగాలీ లిపిలో రాసి ఉంటాయి. మణి పురీ పత్రికలు సహితం బెంగాలీ లిపి లోనే ఉంటాయి. కానీ పత్రిక పేరు మాత్రం మణిపురీ లిపిలో, దానికింద బెంగాలీ లిపిలో రాసి ఉంటాయి. చేయిజారిపోయిన సాంస్కృతిక అస్తి త్వాన్ని పునరుద్ధరించే ప్రయాస కష్టతర మయినదే మరి!

వైష్ణవ మతం రూపంలోనూ, బెం గాలీ లిపి రూపంలోనూ మీయ్‌తీలు తమ సాంస్కృతిక ప్రత్యేకతను కొంత పోగొట్టుకున్నారు గానీ 1947 దాకా రాజకీయ అస్తిత్వాన్ని విజయవంతం గానే కాపాడుకున్నారు. ఇండియా నుం డే కాదు, మయన్మార్ నుండి కూడా.

18వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో మణిపూర్‌ను దీర్ఘకాలం పరిపాలించిన పమ్‌హీయ్‌బా పాలనా కాలం మణిపూర్ చరిత్రలో అత్యున్నత దశగా భావిస్తారు. అతను వైష్ణవ మతం స్వీకరించి వైష్ణవాన్ని అధికార మతంగా చేసినా తనకు తాను 'గరీబ్‌నవాజ్' అనే




**మ**ణిపూర్ రాష్ట్రంలో మొత్తం తొమ్మిది జిల్లాలు న్నాయి. కొండ ప్రాంతంలో ఉన్నవి సేనాపతి, తామెంగ్‌లాంగ్, ఉఖ్రుల్, చందేల్, చురాచంద్ పూర్ జిల్లాలు. వీటిలో మొదటి నాలుగింటిలో ప్రధానంగా నివసించేది నాగా తెగలు. చురా చంద్‌పూర్‌లో ప్రధానంగా నివసించేది కుకీ తది తర నాగాయేతర తెగలు. కుకీ తెగను బర్మాలో చిన్ అంటారు కాబట్టి రెండు పేర్లూ కలిపి చిన్–కుకీ లేక కుకీ–చిన్ అని పిలుస్తుంటారు.

లోయ ప్రాంతంలో ఉన్నవి ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, తౌబాల్, బిష్ణుపూర్ జిల్లాలు. ఇక్కడ ప్రధానంగా నివసించేది మీయ్‌తీలు.

నాగా, కుకీ అనేవి ఒక తెగ పేరు కాదు. అవి తెగల సముదాయాలు. ఉదాహరణకు మణి పూర్‌లోని ప్రధాన నాగా తెగలు తంగ్‌కుల్, మావో, జెలియాంగ్రాంగ్. మొత్తం మణిపూర్ రాష్ట్రంలో 29 తెగలున్నాయి.

ఇస్లామిక్ సంప్రదాయానికి చెందిన బిరుదు ఇచ్చుకున్నాడు (హిందూ-ముస్లిం అనేవి ఈ రోజు మనకు కనిపించినంత శత్రుభావాలుగా ఆ రోజు కనిపించలేదనుకోవాలి). ఇతని హయాంలో మణిపూర్ సైన్యం మయన్మార్ పైన యుద్ధాలు చేసి గెలిచింది కూడా.

అయితే 18వ శతాబ్దపు ద్వితీయార్థంలో – పమ్‌హీయ్‌బా మరణం తరువాత – మణిపూర్ రాజవంశంలో అంతర్గత కలహాలు పొడచూపడం మయన్మార్‌కు ఉపకరించింది. క్రీ.శ. 1755-1826 మధ్యలో ఆ దేశ సేనలు మణిపూర్ పైన పలుమార్లు దాడులు చేశాయి. ఈ దాడులను ఎదుర్కొనడానికి మణిపూర్ రాజు జైసింగ్ తూర్పు ఇండియా కంపెనీతో 1762లో ఒక ఒప్పందం చేసుకున్నాడు. మయన్మార్ అప్పటికి ఫ్రెంచివారి నుండి యుద్ధ సాంకేతిక ప్రక్రియలూ, పరికరాలూ పొందింది కాబట్టి వారిని ఎదుర్కొనడానికి బ్రిటిష్ సహాయం మణిపూర్‌కు అవసరం అని రాజు భావించాడు.

తూర్పు ఇండియా కంపెనీ చిట్టగాంగ్ ఫోర్ట్ అధిపతి హెన్రీ వెరెల్ట్ చేసుకున్న ఈ ఒప్పందాన్ని లండన్‌లోని కంపెనీ డైరెక్టర్లు ఆమోదించకపోవడం వల్ల అది అమలు కాలేదు. జైసింగ్ కొడుకు గంభీర్ సింగ్ కాలంలో మయన్మార్ మణిపూర్ పైన దాడిచేసి లోబరచుకోవడమే కాక బెంగాల్ లోని (ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని) సిల్హెట్‌ను కూడా ఆక్రమించుకునింది. అప్పుడు ఇంగ్లీష్ వాళ్లు గంభీర్‌సింగ్ తో చేతులు కలిపి మయన్మార్‌ను ఓడించారు. 1826 యాండాబూ ఒప్పందంలో బ్రిటన్, మయన్మార్‌లు రెండూ మణిపూర్ స్వాతంత్ర్యాన్ని గౌరవించాలని అంగీకరించాయి. 1833లో తూర్పు ఇండియా కంపెనీ స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వమే ఇండియాను ఏలడానికి రంగంలోకి దిగినప్పుడు, వారు మణిపూర్ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తూ ఒప్పందం చేసుకున్నారు.

అయితే ఇదంతా కూడా మణిపూర్ మయన్మార్‌కూ ఇండియాకూ మధ్య 'బఫర్ జోన్'గా ఉందనే తప్ప మణిపురీ సార్వభౌమత్వమంటే ఇంగ్లీష్ వాళ్లకు గౌరవం ఉండి జరగలేదు. 1885లో బ్రిటన్ మయన్మార్‌ని జయించిన తరువాత ఏ 'బఫర్ జోన్' అవసరం లేకుండా పోయింది. మణిపూర్ సార్వభౌమత్వాన్ని కబళించడానికి అవకాశం కోసం బ్రిటన్ ఎదురు చూడసాగింది.

అది రాజవంశం అంతర్గత కుమ్ములాటల రూపంలో లభించింది. 1890 సెప్టెంబర్ నెలలో మణిపూర్ రాజు సూర్‌చంద్రపైన అతని తమ్ముళ్లు తిరుగుబాటు చేశారు. సూర్‌చంద్ర కలకత్తాకు పారిపోగా, అతని తమ్ముడు కులచంద్ర సింహాసనం ఎక్కాడు. కలకత్తాకు పోయిన సూర్‌చంద్ర వైస్రాయ్‌ని కలిసి తన అధికారం కాపాడమని కోరాడు. బ్రిటిష్ పాలకులు ఆ పని చేయలేదుగానీ ఈ ఘటనను ఆసరా చేసుకొని మణిపూర్ పైన తమ పెత్తనం నెలకొల్పే ప్రయత్నం చేశారు. కుల చంద్రను రాజుగా గుర్తిస్తూ, మరొక తిరుగుబాటుదారయిన తికేంద్రజిత్‌ను అరెస్టుచేసి కులచంద్ర పాలన ముగిసేదాకా తమ అదుపులో మణిపూర్ బయట ఉంచుకోవాలని నిర్ణయిం

చుకున్నారు. ఈ నిర్ణయం అమలు చేయడానికి అస్సాం రాష్ట్ర చీఫ్ కమిషనర్‌కు 400 మంది సైనికులనిచ్చి మణిపూర్ రాజధాని ఇంపాల్‌కు పంపారు. అతను 1891 మార్చి 22న ఇంఫాల్ చేరి బ్రిటిష్ పాలకుల నిర్ణ యాన్ని ప్రకటించాడు. అయితే కులచంద్ర మహారాజు తికేంద్రజిత్‌ను అప్పగించడానికి ఒప్పు కోలేదు. దానితో బ్రిటన్‌కూ మణిపూర్‌కూ యుద్ధం మొదలయింది.

మొదటి దఫా బ్రిటిష్ సేనలు చావుతప్పి కన్ను లొట్టపోయిందన్న విధంగా ప్రాణాలు దక్కిం చుకున్నాయి. మార్చి 28న బ్రిటిష్ సేనలు మయన్మార్ వైపు నుండి దాడిచేసి మణిపూర్ సైన్యాన్ని కొంత దెబ్బతీయగలిగినా ఏప్రిల్ 8న వెనుదిరగక తప్పలేదు.

మూడవసారి బ్రిటిష్ వాళ్లు ఏ పొరబాటూ చేయదలచుకోలేదు. మణిపురీ సేనల యుద్ధ నైపుణ్యం, పట్టుదల ఎంతటిదైనా సంఖ్యాబలం తక్కువని గ్రహించి పెద్ద సంఖ్యలో జవాన్లను కదిలించి మూడు మార్గాల గుండా మణిపూర్ పైన ఒకేసారి దండెత్తారు. అందులో రెండు ప్రస్తుతం మణిపూర్‌లోకి 'ఇండియా' నుండి ప్రవేశించే రెండు జాతీయ రహదారి మార్గాలు. ఒకటి కోహిమా నుండి, ఇంకొకటి సిల్చార్ నుండి మణిపూర్‌లోకి ప్రవేశిస్తాయి. మూడవది ఈరోజు మయన్మార్ నుండి మణిపూర్ మీదుగా అస్సాం, బెంగాల్‌లకు వచ్చే ప్రధాన స్మగ్లింగ్ రహదారి. అది మయన్మార్‌లోని తాము నుండి ఇంఫాల్‌కు వస్తుంది.

మూడు మార్గాల మీదుగా ఒకేసారి జరిగిన దాడికి తట్టుకోలేక మణిపురీ సేనలు ఓడి పోయాయి. 27 ఏప్రిల్ నాడు ఇంఫాల్‌లోని కాంగ్లా కోట మీద ఇంగ్లీష్ జెండా ఎగిరింది. (ఇంగ్లీష్ వాళ్లకు వారసులుగా అదే కోటలో సైన్యాన్ని మోహరించి మణిపూర్‌ను పరిపాలించిన భారత ప్రభుత్వం మొన్న నవంబర్ 19న తన జెండాను కాంగ్లా కోట నుండి దించి ఆ కోటను మణిపురీలకు అప్పగించింది.)

అయితే మణిపూర్ మరీ మారుమూల ప్రాంతం కావడం వల్లనో ఏమో, బ్రిటిష్ వాళ్లు ఆ రాజ్యాన్ని బ్రిటిష్ పాలిత బెంగాల్ రాష్ట్రంలో కలిపేసుకోలేదు. దానిపైన తమ సార్వభౌమ అధికారాన్ని ప్రకటించి, అప్పటికింకా బాలుడిగా ఉన్న యువరాజు చురాచంద్‌ను భవిష్యత్ రాజుగా నియమించి వెళ్లిపోయారు. కాశ్మీర్‌లాగా, హైదరాబాద్‌లాగా, మైసూరులాగా, భోపాల్ లాగా మణిపూర్ కూడా 1947 దాకా బ్రిటిష్ సార్వభౌమత్వాన్ని ఆమోదించిన ఒక స్థానిక సంస్థానంగా ఉండిపోయింది.

## మణిపూర్: 1947–1949

ఏ పని చేసినా చట్టబద్ధంగా చేయడం ఆధునిక బ్రిటిష్ నాగరికతకుండే విశిష్టమైన గుణం. ఆ పని మంచిదే కానక్కరలేదు, చెడ్డది కూడా కావచ్చు. ఆ చట్టం న్యాయమైనదే కానక్కరలేదు, అన్యాయమైనది కూడా కావచ్చు. కానీ ఒక పని చేయాలంటే దానికి ఏ చట్టం లేక చట్ట సంబం ధమైన సూత్రం వర్తిస్తుందా అని వెతికి, ఏదీ లేకపోతే కొత్తగా ఒక చట్టం చేసి, దానిననుసరించి

నడుచు కోవడం వాళ్ల అలవాటు.

భారతదేశాన్ని ఇంక పరిపాలించడం అసాధ్యమనో, అనవసరమనో నిర్ణయించుకున్న తరువాత సంచులు సర్దుకొని వెళ్లిపోక బ్రిటిష్ పార్లమెంటు ఒక చట్టం చేసి భారత్‌కు స్వాతంత్ర్యం చట్టబద్ధంగా ఇచ్చింది.

ఆ చట్టం ప్రకారం బ్రిటన్ ప్రత్యక్షంగా పరిపాలించిన ప్రాంతమంతా పూర్తి స్వాతంత్ర్యం పొందుతుంది. అయితే మతం ప్రాతిపదికన ఆ భూభాగం రెండుగా చీలి ఒకటి ఇండియా, ఒకటి పాకిస్తాన్ అవుతాయి. కాగా, బ్రిటన్ కేవలం సార్వభౌమ అధికారం చలాయించిన సంస్థానాల పాలకులు బ్రిటన్ నిష్క్రమణతో తమ స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందుతారు. ఇండియాలో చేరాలా పాకిస్తాన్‌లో చేరాలా లేక స్వతంత్రంగా ఉండిపోవాలా అన్నది వారే నిర్ణయించుకోవచ్చు.

ఈ విధంగా 1891లో సార్వభౌమత్వాన్ని బ్రిటన్‌కు అప్పగించిన మణిపూర్ రాజవంశం 1947లో దానిని తిరిగి పొందింది. అన్ని సంస్థానాలలాగే మణిపూర్ పైన కూడా భారత్‌లో చేరాలన్న ఒత్తిడి కాంగ్రెస్ నాయకుల నుండి బలంగా ఉండింది. (ప్రజలు గానీ రాజుగానీ ముస్లింలు అయివుంటే అదే ఒత్తిడి పాకిస్తాన్ నుండి ఉండేది). అయితే క్రీ.శ. 33 నుండి ఒక స్వతంత్ర రాజ్యంగా ఉండి ఇటు 'ఇండియా'లోని రాజ్యాల నుండి అటు మయన్మార్ నుండి తమ స్వాతంత్ర్యాన్ని కాపాడు కుంటూ వచ్చిన మణిపురీలు – రాజుగానీ పౌరులుగానీ – ఇండియాకు తమ స్వాతంత్ర్యాన్ని అప్పగించదలచుకోలేదు. అయితే భారత్‌ను అసలేకాదనడం చిన్న చిన్న సంస్థానాధీశులకు సాధ్యంకాదు కాబట్టి, కాశ్మీర్ పాలకుడి లాగ మణిపూర్ రాజు కూడా స్వయం ప్రతిపత్తితో కూడిన విలీనాన్ని ఎంచుకున్నాడు. భారత కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశ వ్యవహారాలు, ప్రసార రంగాల పైన మాత్రం అధికారం ఇచ్చే ప్రాతిపదికన మణిపూర్‌ను మణిపూర్ రాజు భారత్‌లో విలీనం చేశాడు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే భారత్‌లో మణిపూర్‌ను విలీనం చేయాలా వద్దా అన్న నిర్ణయం కంటే ముందే మణిపూర్ పాలనా వ్యవస్థ ఏవిధంగా ఉండాలన్న విషయంలో నిర్ణయాన్ని మణిపురీలు తీసుకున్నారు. తమకంటూ ఒక రాజ్యాంగాన్ని రాసేసుకున్నారు. మణిపూర్‌లో రాచరికాన్ని ఉండనిస్తూనే చట్టబద్ధ పాలన ప్రాతిపదికన రాజ్యాంగాన్నీ ఎన్నికల వ్యవస్థనూ ఏర్పరచుకోవాలని నిర్ణయించుకున్నారు. లోయ ప్రాంతం నుండి తొమ్మిది మందితో, కొండ ప్రాంతం నుండి ఆరుగురితో, ఒక పాశ్చాత్య సలహాదారుతో మొత్తం 16 మందితో ఒక రాజ్యాంగ రచనా కమిటీని రూపొందించుకున్నారు. ఆ కమిటీ 1947 మార్చినెలకల్లా రాజ్యాంగాన్ని రాసేసింది. భారత్ ఇంకా స్వతంత్రం కాకముందే మణిపూర్ తన రాజ్యాంగాన్ని తాను అమలులోకి తెచ్చుకుంది. భారత్ ఒత్తిడి ఫలితంగా ఆగస్టు నెలలో స్వయం ప్రతిపత్తితో కూడిన

విలీనానికి అంగీకరిస్తూ, 1948లో భారత ఎన్నికల కమిషన్‌తో నిమిత్తం లేకుండ తమ మొదటి ఎన్నిక తామే నిర్వహించుకొని ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా మణిపూర్ అవతరించింది.

భారత పాలకులు దీనితో సంతృప్తి చెంది ఉంటే ఈ రోజు మణిపూర్‌లో కనీసం మీయ్‌తీలతో ఏ సమస్యా ఉండేది కాదు. కానీ మణిపూర్‌ను పూర్తిగా ఇండియాలో కలిపేసుకోవాలనే మన వారు కోరుకున్నారు. కాశ్మీర్‌లో లాగా, 'పాకిస్తాన్ దౌర్జన్యానికి దిగుతున్నది కాబట్టి మన ప్రయోజనాలను మనం కాపాడుకోక తప్పదు' అని వాదించడానికి మణిపూర్ విషయంలో అవకాశం లేదు. మణిపూర్ మీద వేరే దేశమేదయినా కన్ను వేయడమంటూ జరిగితే అది మయన్మార్ కావాలి. అయితే మణిపూర్ స్వతంత్ర రాజ్యంగా ఉన్నప్పుడు దానిపైన దాడి చేసే ప్రయత్నం మయన్మార్ చేసిందిగానీ ఇండియా మీద యుద్ధం చేసే ఆలోచన గానీ, సాహసం గానీ ఆ దేశానికి లేవు. కాబట్టి ఒక స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా తన స్వంత రాజ్యాంగం ప్రకారం మణిపూర్ మనగలిగి ఉండేది. మణిపురీలు, భారతీయులు స్నేహితులుగా ఉండేవారు.

కానీ ఉక్కుమనిషి సర్దార్ పటేల్‌కూ, ఆయన 'ఉక్కు'తనం చాటున ప్రజాస్వామ్యవాదిగా చలామణి అయిన నెహ్రూకూ ఇది నచ్చలేదు. మణిపూర్‌ను సంపూర్ణంగా కలిపేసుకోవాలనే నిర్ణయించుకున్నారు. మణిపూర్ రాజు మీద భారత్ చాలా ఒత్తిడి పెట్టింది. బలప్రయోగానికి దిగడానికి సహితం భారత్ వెనకాడలేదని సూచించే ఉదంతం ఒకటి చాలామంది చెప్తారు. భారత్ తరఫున మణి పూర్ ప్రభుత్వంతో మాట్లాడుతున్న అస్సాం గవర్నర్ శ్రీప్రకాశ ఆ రోజు లలో సర్దార్ పటేల్‌ను కలిసి, రాజు ఎంత చెప్పినా వినడం లేదని వాపోయాడంట. 'అక్కడ మన బ్రిగేడియర్ ఎవడూ లేడా?' అని సర్దార్ పటేల్ అడిగాడంట.

బెదిరించారో, బుజ్జగించారోగానీ మణిపూర్ రాజు బుధచంద్ర సింగ్ 1949 సెప్టెంబర్ 21న ఆ రాజ్యాన్ని ఇండియాలో పూర్తిగా విలీనం చేస్తూ ఒక విలీన ఒప్పందం మీద సంతకం చేశాడు. దీనిని మణిపూర్ విలీన ఒప్పందం అంటారు. అప్పటికే మణిపూర్‌కు ఒక రాజ్యాంగం ఉంది. దాని కింద రాజుకుండే అధికారం పరిమితమైనదే. ఆ రాజ్యాంగాన్ని అనుసరించి మణి పురీలు అప్పటికే ఎన్నిక జరుపుకొని 1948 మార్చిలోనే ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకు న్నారు. రాజ్యాంగ రచనా కమిటీలో మైదాన ప్రాంతానికీ, కొండ ప్రాంతానికీ తగు ప్రాతినిధ్యం ఇచ్చినట్టే కొత్త ప్రభుత్వంలోనూ ఇచ్చారు. తొలి కేబినెట్‌లోని ఏడుగురిలో ఇద్దరు కొండ ప్రాంతం వారు (ఇద్దరూ నాగాలే). కొండ ప్రాంతాలకు ప్రత్యేక పాలనా నియమాలు అవసరమని గుర్తించి 'మణిపూర్ రాజ్య కొండ ప్రాంతాల (పాలనా) నియమావళి'ని రూపొందించుకున్నారు. భారత్ కోరికను కాదనకుండ రక్షణ, విదేశ వ్యవహారాలు, ప్రసార రంగాలలో అధికారం ఢిల్లీకి పడేసి తమ వ్యవహారాలను తాము బాధ్యతాయుతంగానే మణిపురీలు నిర్వహించుకోవడం మొదలు పెట్టారు.

ఆ సమయంలో బలవంతపు విలీనం జరిగింది. విలీన ఒప్పందం మీద సంతకం చేసిన

రాజుకు అప్పటికే అమలులోకి వచ్చిన మణిపూర్ రాజ్యాంగం కింద ఆ అధికారం లేదు. ఎన్నిక యిన ప్రభుత్వాన్ని గానీ, చట్టసభను గానీ సంప్రదించలేదు. ప్రజాభిప్రాయ సేకరణ అసలే జరగలేదు. అయినప్పటికీ విలీనం 'జరిగిపోయింది'. పోనీ, అప్పటికే ఒక చట్ట సభ, ఒక ప్రభు త్వం ఉన్న మణిపూర్‌ను కనీసం ఒక రాష్ట్రంగా భారత్‌లోకి స్వీకరించారా అంటే అది కూడా లేదు. 20 సంవత్సరాలకు పైగా కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండి, 1972లో రాష్ట్రం అయింది. సరిహద్దు ప్రాంతాల ప్రజలను ఇండియాలోకి కలిపేసుకోవాలని భారత పాలకులు ఎంత పట్టు దలగా ఉన్నారో, వారికి భారత్ పట్ల ఉండే నిబద్ధత పట్ల అంత అనుమానంగానూ ఉన్నారు. ఢిల్లీ గుప్పిట్లో గట్టిగా వాళ్లను పెట్టుకోకపోతే తప్పిపోతారన్న సందేహం అడుగడుగునా వ్యక్తం చేస్తూ వచ్చారు. అసలే తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండ భారత్‌లో భాగం చేసుకున్నం దుకు అసహనంగా ఉన్న ప్రజలకు ఈ సందేహ దృష్టి మరీ అవమానకరంగా తోచి ఉంటుందని భారత పాలకులకు ఎన్నడూ అనిపించలేదు.

## సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం:

'మణిపురీ' అన్న పదం పైన చాలాసార్లు వాడాము గానీ ఆ ఘటనలలో ప్రధాన పాత్రధా రులు మీయ్‌తీలు. వీరు మణిపూర్ రాష్ట్రం నడుమనున్న లోయ ప్రాంతవాసులనీ, వైష్ణవ మతం ద్వారా హైందవీకరణ చెంది ఉన్నారనీ చెప్పాము. భారత్ నుండి మణిపూర్ వేరు కావాలని, లేదా మణిపూర్‌కు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలనీ కోరుకునే ఉద్యమాలలో ప్రధాన పాత్ర మీయ్‌తీ లదే. మణిపురీ జాతీయవాదం పూర్తిగా కాకున్నా ప్రధానంగా మీయ్‌తీ జాతీయవాదమే.

రాష్ట్రం ఉత్తర, పశ్చిమ భాగాన ఉన్న కొండలలో నివసించే తెగలలో నాగా తెగలు ముఖ్యమై నవి. వీరి రాజకీయ ఆకాంక్ష మణిపూర్‌కు ఉత్తరాన ఉన్న నాగాలాండ్‌లోని నాగాల ఆకాంక్షలతో ముడిపడి ఉంది. బలవంతపు విలీనం పట్ల మీయ్‌తీలలో నిరసన 1950ల నుండీ కూడా బలంగానే ఉన్నా అది 1970ల చివరి దాకా భారత ప్రభుత్వానికి తలనొప్పి కలిగించే స్థాయి గానీ, రూపంగానీ తీసుకోలేదు.

నాగాలలో తిరుగుబాటు అంతకు ముందే మొదలయింది. మణిపూర్ ఉత్తరార్ధాన నాగాలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల దాని ప్రభావం, నిర్బంధంతో సహా, మణిపూర్ పైన పడింది. మొట్టమొదటి నిర్బంధ చట్టమైన సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం, 1958 పేరులో 'మణిపూర్' ఉండడానికి కారణం మణిపురీ జాతీయవాద పోరాటం కాదు. మణిపూర్‌లో కూడా ఉన్న నాగా జాతి పోరాటం. మణిపురీ లేక మీయ్‌తీ జాతి పోరాటం 1970ల చివరి నాటికి గానీ ఉధృతం కాలేదు. అయితే ఇప్పుడు కొన్ని సంవత్సరాలుగా నాగా పోరాట సంస్థలకూ భారత ప్రభుత్వానికీ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంది. అది మణిపూర్‌లోని నాగా ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. నాగా పోరాటకారులకూ భారత

ప్రభుత్వానికీ మధ్య చర్చలు కూడా నడుస్తున్నాయి. అందువల్ల ప్రస్తుతం మణిపూర్‌లో సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టానికి వ్యతిరేకంగా నడుస్తున్న ఆందోళన ప్రధానంగా మీయ్‌తీల ఆందోళన. అయినప్పటికీ ఆ చట్టం అమలుకు సంబంధించిన చరిత్ర తెలుసుకోవాలంటే నాగా ప్రజల ఆకాంక్షలకు సంబంధించిన చరిత్ర తెలుసుకోవడం అవసరం.

> ## నాగాభవాని
>
> **మా** బృందం నాగాలాండ్‌లోని దిమాపూర్ మీదుగా గౌహతికి వెనక్కి వస్తుండగా ఒక ఘటన వినవచ్చింది. అవి దసరా పండగ రోజులు. బెంగాలీలు దుర్గాదేవిని రకరకాల రూపాలలో అలంకరించి వినోదిస్తారు. కలకత్తాలోని ఒక పూజా మండలి వారు సరదాగా దేవికి నాగా దుస్తులు వేశారట. ఈ వార్త పత్రికలలో చదివిన దిమాపూర్ నాగాలు ఆగ్రహించారు. తమ జాతికి అవమానం జరిగిందని ప్రకటించారు. దిమాపూర్‌లోని బెంగాలీలు భయపడి కలకత్తా పూజా మండలికి కబురు పంపగా వారు హడావుడిగా దేవి దుస్తులు మార్చి పత్రికా ముఖంగా నాగా ప్రజలకు క్షమాపణ కూడా చెప్పుకున్నారు. అయినా దిమాపూర్ శాంతించలేదు. నాగా సంఘాలు సమావేశాలు జరిపి, ఆ పూజా మండలి వారు నాగాలాండ్‌కు వచ్చి బహిరంగంగా క్షమాపణ కోరుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు.

బ్రిటిష్ వలస పాలకులు తమ వలసల సరిహద్దులను కేవలం తమ సామ్రాజ్య భద్రతనూ పాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయించారని చెప్పుకున్నాం. దీనివల్ల చాలా నష్టపోయిన వారు నాగాలు. నాగా అన్నది ఒక తెగ పేరు కాదు. భాషా సంస్కృతులలో పరస్పరం దగ్గరి వారయిన కొన్ని తెగల సామాన్య నామధేయం నాగా అనేది. ఆ తెగలన్నీ తమను తాము 'నాగా తెగలు'గా భావించుకుంటాయి. వాటిలో ముఖ్యమైనవి అంగామీ, తంగ్‌కుల్, మావో, ఆవో. అసలు నాగా జాతి అనేదేదీ లేదనీ బ్రిటిష్ వారి విభజించి పాలించే నీతిలో భాగంగా కొన్ని తెగలకు నాగా అని పేరుపెట్టి ఇతర తెగల పైన వారిని బ్రిటిష్ పాలకులు ఎగదోసారని అనేవారు లేకపోలేదు. కానీ అది ఎవరో దుర్బుద్ధితో పెట్టిన పేరయితే ఆ గుర్తింపు నాగాలలో అంతటి ఆవేశం కలిగించదు. ఒక్కొక్కసారి దురభిమానం దాకా పోయే ఈ తాదాత్మ్యం (చూడండి నాగాభవాని, పే.13) మనస్ఫూర్తిగా ప్రజలలో ఉన్నదే. అది వారి స్వీయ గుర్తింపే.

1947 వచ్చేసరికి నాగాలు (అప్పటి) అస్సాం రాష్ట్రంలోనే కాక మణిపూర్‌లో ఉన్నారు, మయన్మార్‌లో పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. బర్మా ప్రభుత్వం ఉత్తరానికి విస్తరించి నాగాలు నివసించే భూభాగాన్ని కలుపుకోవడానికి బ్రిటిష్ పాలకులు సహకరించిన కారణంగా, 1947 నాటికి నాగాల నివాస స్థలంలో మూడవ వంతు బర్మాలో కలిసిపోయిందని ఒక అంచనా. ఏమయితేనేం, భారత స్వాతంత్ర్యానికి పూర్వమే నాగాలు తమ భవితవ్యాన్ని గురించి తమ

# హైదరీ - ఎన్ఎన్సి

**ఉపోద్ఘాతం:** నాగాలకు తమ ఆకాంక్షల ననుసరించి తమను తాము స్వేచ్ఛగా అభివృద్ధి చేసుకునే హక్కు ఉందని గుర్తించడమైనది.

**1. న్యాయవ్యవస్థ:** 'నాగా కొండల' ప్రాంతంలో నాగా ప్రజల మధ్య తలెత్తే అన్ని వివాదాలు, అవి సివిల్ స్వభావం కలిగినవయినా, సంప్రదాయక నాగా చట్టం ప్రకారం నాగా న్యాయస్థానాలలో పరిష్కరించబడతాయి. నిర్ణీత పద్ధతిలో ఎంపిక చేయబడిన నాగా ప్రతి నిధుల సమ్మతితో ఈ చట్టంలో మార్పులు ప్రవేశపెట్టవచ్చు. అయితే ఈ సంప్రదాయక న్యాయస్థానాలు మరణదండన విధించినట్టయితే మాత్రం గవర్నర్కు అప్పీల్ చేసుకునే హక్కు ఉంటుంది. కోహిమా, మొకోక్ చుంగ్ పట్టణాలలోనూ, పరిసర మైదాన ప్రాంతాలలోనూ నాగాలకూ నాగాయేతరులకూ మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే జడ్జి నాగా కానట్టయితే అతనికి తోడుగా నాగా అసెసర్ ఉంటాడు.

**2. పాలనా వ్యవస్థ:** నాగా నేషనల్ కౌన్సిల్ ఏమేరకయితే పాలనా వ్యయాన్ని భరించగలదో ఆమేరకు పరిపాలించే అధికారం కలిగి ఉంటుందన్న సాధారణ సూత్రాన్ని అంగీకరించడమైనది. వ్యయం అంటే పనులకయ్యే వ్యయయేకాదు, సిబ్బంది జీతాలు కూడా.

జిల్లా అధికారిని గవర్నర్ నియమిస్తారు. 'నాగా కొండల' ప్రాంతాలున్న సబ్-డివిజన్ను ఒక సమితి పరిపాలిస్తుంది. దాని అధ్యక్షుడు ఎన్ఎన్సి నుండి జీతం పొందే పూర్తికాలం పాలనాధికారి అయి వుంటాడు. జిల్లా అధికారి పరిధిలోని విషయాలలో ఆ అధికారికి, ఎన్ఎన్సి పరిధి లోని విషయాలలో ఎన్ఎన్సికి అతను జవాబుదారుగా ఉంటాడు.

(ఎ) వ్యవసాయ రంగంలో ప్రస్తుతం జిల్లా అధికారి చేతిలో ఉన్న అధికారాలు ఎన్ఎన్సికి బదలాయించబడతాయి.

(బి) ప్రజాపనుల శాఖ పూర్తిగా ఎన్ఎన్సి చేతిలో ఉంటుంది.

(సి) విద్య, అటవీశాఖలలో అన్ని పన్నులకూ అందరు సిబ్బందికీ అయ్యే ఖర్చు పెట్టుకోవడానికి ఎన్ఎన్సి సిద్ధం.

**3. శాసన వ్యవస్థ:** ఈ ఒప్పందం గడువుకు గానీ నాగాల మతాచారాలకు గానీ భంగం కలిగించే చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీ చేసినా, కేంద్ర పార్లమెంటు చేసినా అది ఎన్ఎన్సి అనుమతి లేనిదే నాగా కొండ ప్రాంతాలలో చట్టం కాదు.

ఒకవేళ ఈ ఒప్పందానికి భంగం కలుగుతుందా లేదా అన్న వివాదం ఏర్పడితే ఎన్ఎన్సి ఆ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకురావాలి. కేంద్ర ప్రభుత్వం ఈ వివాదాన్ని తీర్చేదాకా ఆ

## ఒప్పందం (జూన్ 1947)

చట్టం అమలును గవర్నర్ నిలుపుదల చేస్తాడు.

**4. భూమి:** నాగా కొండలలో భూమిని, దానిలోని వనరులను, ఎన్ఎన్సి అనుమతి లేకుండ నాగాయేతరులకు బదలాయించకూడదు.

**5. పన్నుల వ్యవస్థ:** భూమిశిస్తు, ఇంటి పన్నుల విధింపు, సేకరణ, వ్యయం ఎన్ఎన్సి బాధ్యత. ఎన్ఎన్సి వేయదలచుకున్న ఇతర పన్నులకు కూడా ఇది వర్తిస్తుంది.

**6. సరిహద్దులు:** ప్రస్తుత పాలనా హద్దులను కింది విధంగా సవరించారు. (1) గతంలో శిబ్సాగర్, నౌగాంగ్ జిల్లాలకు బదలాయించిన అడవినంతా నాగాకొండ జిల్లాలో చేర్చాలి. (2) నాగాలందరినీ ఒకే పాలనా విభాగంలోకి తీసుకురావాలి. ఆవిధంగా చేర్చే ప్రాంతాలన్నిటికీ ప్రస్తుత ఒప్పందం వర్తిస్తుంది. నాగాకొండల నుండి భూభాగాన్ని ఎన్ఎన్సి అనుమతి లేకుండా బయటికి బదలాయించడానికి వీలులేదు.

**7. ఆయుధాల చట్టం:** జిల్లా యంత్రాంగం ఆయుధాల చట్టాన్ని అనుసరించి ఎన్ఎన్సి సలహా ప్రకారం నడుచుకుంటుంది.

**8. నియమాలు:** చిన్ హిల్స్ రెగ్యులేషన్, బెంగాల్ తూర్పు సరిహద్దు రెగ్యులేషన్ అమలులో ఉంటాయి.

**9. ఒప్పందం గడువు కాలం:** ఈ ఒప్పందం పది సంవత్సరాల కాలం సరిగ్గా అమలయ్యేటట్టు చూసే బాధ్యత భారత ప్రభుత్వ ప్రతినిధి అయిన అస్సాం గవర్నర్‌ది. ఆ తరువాత ఈ ఒప్పందాన్ని మరికొంత కాలం పొడిగించాలా లేక నాగా ప్రజల భవితవ్యం గురించి కొత్త ఒప్పందం కోరుకుంటారా అని ఎన్ఎన్సిని అడగడం జరుగుతుంది.

(**నోట్:** 'నాగాకొండలు' లేక నాగాహిల్స్ అనేది అప్పటి అస్సాం రాష్ట్రంలో నాగాలు ఎక్కువగా నివసించే కొండ ప్రాంతాలు. 1962లో నాగాలాండ్ అనేది ఏర్పడినప్పుడు ఈ నాగా కొండలే అందులో ప్రధాన భాగం అయ్యాయి. ఈ నాగాకొండలకు ప్రత్యేక ప్రతిపత్తి ఇస్తూ 1947 జూన్‌లో చేసుకున్న ఒప్పందం కొత్తదేమీ కాదు. 1880కి పూర్వం బ్రిటిష్ వాళ్లు ఈ కొండలలో ఏ అధికారమూ చలాయించలేదు. 1880 తరువాత కేవలం సైనిక స్థావరాలు నెలకొల్పే అవకాశం నాగాలు వారికి ఇచ్చారేగానీ పాలనాధికారం ఇవ్వలేదు. 1935 భారత ప్రభుత్వ చట్టం కూడా నాగాకొండలను 'ఎక్స్‌క్లూడెడ్ ఏరియా'గా వర్గీకరించి వారి స్థానిక స్వయం పాలనను అంగీకరించింది. అక్బర్ హైదరీ ఎన్ఎన్సి ఒప్పందం దానినే కొనసాగించింది.)

అభిప్రాయం ప్రకటించారు. అప్పటి అస్సాం గవర్నర్ అయిన అక్బర్ హైదరీతో నాగా ప్రజల ప్రతినిధి అయిన నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్ఎన్సి) 1947 జూన్ నెలలో ఒక ఒప్పందం చేసుకునింది. ఆ ఒప్పందానికి లోబడి నాగాలు పది సంవత్సరాల పాటు భారత్‌లో ఉండాలనీ పది సంవత్సరాల తరువాత ఆ ఒప్పందాన్ని పునఃపరిశీలించాలనీ ఇద్దరూ ఒప్పుకున్నారు. ఒప్పందాన్ని పునఃపరిశీలించడమంటే నాగాలు అసలు ఇండియాలో కొనసాగాలా లేదా అన్న పునఃపరిశీలన కూడా దానిలో భాగమేనని 1957 వచ్చేసరికి నాగాలు వాదించగా, భారత్ ఒప్పుకోలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన గవర్నర్‌తో ఎన్ఎన్సి చేసుకున్న ఒప్పందం స్వతంత్ర భారత ప్రభుత్వానికి శిరోధార్యం కాదనింది. అంతేకాక ఒప్పం దం పునఃపరిశీలన అంటే ఒప్పందంలోని అంశాల పునఃపరిశీలన మాత్రమే తప్ప నాగాలు భారత్‌లో ఉండాలా లేదా అన్న పునఃపరిశీలన కాదని కూడా వాదించింది. నాగాలకు స్వాతం త్ర్యం ఇచ్చే ప్రసక్తే లేదని జవహర్‌లాల్ నెహ్రూ స్పష్టం చేశారు. నిజానికి నాగాలతో ఒప్పందం చేసుకున్న అక్బర్ హైదరీ బ్రిటిష్ పాలకులు నియమించిన గవర్నరే అయినా, నాగాలతో మాట్లాడి ఏదో ఒక ఒప్పందం చేయమని అతనిని పురమాయించింది నెహ్రూయే. అప్పట్లో ఏదో ఒకరకంగా నాగాలను మంచి చేసుకోవాలనుకున్నారు. పది ఏళ్ల తరువాత దబాయింపుకు దిగారు.

నాగా ప్రజలు తిరగబడ్డారు. ఆ తిరుగుబాటు వెంబడే నిర్బంధ చట్టాలు వచ్చాయి. తాము ఎన్నడూ ఏరకంగానూ ఇండియాలో భాగం కాదు కాబట్టి తమను బలవంతంగా ఇండియాలో కలుపుకోవడానికి వీలులేదనేది నాగాల వాదన కాగా, మా రాజ్యాంగం రాసుకున్నప్పుడు బ్రిటిష్ వాళ్ల నుండి సంక్రమించిన భూభాగమంతా ఇండియాయే అని మేము రాసేసుకున్నాము కాబట్టి, అందులో మీ భూభాగం కూడా ఉంది కాబట్టి, మీరు ఇండియన్సేననేది భారత్ వాదన. (దీనిని వెక్కిరింతగా ఎవరూ భావించనక్కరలేదు. భారత్ వాదనలో ఇంతకన్నా తర్కమేమయినా ఉందేమో ఎవరినయినా అడిగి చూడండి – అంటే మేము క్షమాపణ కోరుకుంటాం). భారత్‌ను సవాలుచేస్తూ ఎన్ఎన్సి 1951 మే నెలలో రెఫరెండం నిర్వహించగా 99 శాతం స్వాతంత్ర్యం కావాలన్నారు. 1952 పార్లమెంటు ఎన్నికలలో నాగా కొండలలో ఒక్క వోటూ పడలేదు.

ఒక్కొక్క దశలోనూ భారత ప్రభుత్వం నాగాలలో ఒక ప్రముఖుడినో, ఒక సంస్థనో పట్టుకొని ఏదో ఒక ఒప్పందం చేసేసుకొని 'సమస్య'ను పరిష్కరించుకోవాలని చూస్తున్నది. 1962లో ఒక ఒప్పందం, 1975లో ఒక ఒప్పందం జరిగాయి. 1962లో అస్సాంలోని నాగా ప్రాంతా లను వేరుచేసి నాగాలాండ్ అనే కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పరచారు. (1972లో అది రాష్ట్రం అయింది). 1975లో ఆ మాత్రం మార్పు కూడా రాలేదు. రెండుసార్లూ జరిగిందేమిటంటే ఆ ఒప్పందం చేసుకున్న నాగాలు తమ పరువూ, ఒక సందర్భంలో (1962లో) ప్రాణమూ పోగొట్టు కున్నారు. నాగాల ఆందోళన కొత్త సంస్థల ఆధ్వర్యంలో కొనసాగింది. 1975లో షిల్లాంగ్

ఒప్పందం చేసుకున్న నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్ఎన్సి) పక్కకుపోయి నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఎన్ఎస్సిఎన్) చేతిలోకి పోరాటం పోయింది. అది ఆ తరువాత రెండుగా చీలింది. ఒక భాగమైన ఎన్ఎస్సిఎన్ (ఐ-ఎం) ప్రధానంగా మణిపూర్‌లోని నాగాల నాయకత్వంలో నడుస్తుంది. రెండవ భాగం ఎన్ఎస్సిఎన్ (కె) నాయకులు బర్మాకు చెందిన వారు. ఇద్దరికీ నాగాలాండ్‌లోని నాగాలలో మద్దతు ఉన్నప్పటికీ రెండు పోరాట సంస్థల నాయకత్వమూ బయటివారే. ప్రస్తుతం (1997 నుండి) ఎన్ఎస్సిఎన్ (ఐ-ఎం)తో భారత ప్రభుత్వానికి చర్చలు జరుగుతున్నాయి. కాల్పుల విరమణ కూడా అమలులో ఉంది. ఎన్ఎస్సిఎన్ (కె) చర్చలను బహిష్కరించినప్పటికీ కాల్పుల విరమణలో భాగమయింది.

1957లో హైదరీ-ఎన్ఎన్సి ఒప్పందం పునఃపరిశీలనకు భారత్ ఒప్పుకోకపోవడంతో నాగాలలో తిరుగుబాటు మొదలయిందని అన్నాం. వారి 'మూడ్' అప్పటికే తెలిసిన ప్రభుత్వం 1955లోనే అస్సాం కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని జారీచేసింది. (1954లోనే కోహిమాలోనూ మోకోక్ చుంగ్‌లోనూ హింసాత్మక ఘటనలు జరిగాయి). నాగాల ప్రధాన నివాస ప్రాంతం అప్పటికింకా అస్సాంలోనే ఉందని గుర్తుంచుకోవాలి. ఈ చట్టం పోలీసులకు విశేష అధికారాలు ఇచ్చింది. 1957లో హైదరీ-ఎన్ఎన్సి ఒప్పందం పునఃపరిశీలనకు భారత్ ఒప్పుకోకపోవడంతో సైన్యాన్ని రంగంలోకి దించాలని భారత సర్కార్ భావించింది. నాగాలు అస్సాంలోనే కాక మణిపూర్‌లోనూ ఉన్నారని గుర్తించింది. ఈ రెండింటి ఫలితంగా సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని పార్లమెంటు 1958లో జారీ చేసింది.

మణిపూర్ నుండి పార్లమెంటుకు ఇద్దరు సభ్యులు ఎన్నిక అవుతారు. వీరిద్దరూ ఆ బిల్లును గట్టిగా వ్యతిరేకించారు. వారిద్దరి తరఫున మాట్లాడిన ఇన్నర్ మణిపూర్ పార్లమెంటు సభ్యుడు లైశ్రాం అచావ్‌సింగ్ మీయ్‌తీ తెగకు చెందినవాడు. అప్పటికి మీయ్‌తీల జాతి భావన ఆ చట్టాన్ని ఆకర్షించేంత తీవ్రరూపం తీసుకోలేదు. ఆ చట్టం అప్పటికి నాగాల నుద్దేశించి జారీచేసినది. అయినప్పటికీ అచావ్‌సింగ్ నాకెందుకులే అనుకోలేదు.

'అక్కడ వాళ్లు (అంటే నాగాలు) హత్యలూ, దోపిడీలూ, గృహదహనాలకూ పాల్పడుతున్నారు. కాబట్టి అక్కడి ప్రజల సంరక్షణ కోసం సమర్థమైన చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఇక మీదట ఆ రకమైన పరిస్థితి ఎప్పుడెదురయినా దానిని సైనిక బలగాలు సమర్థంగా ఎదుర్కోగలందుకు ఈ చట్టం అవసరం అని భావిస్తున్నాం' అంటూ కేంద్ర హోం మంత్రి గోవింద వల్లభ్ పంత్ ఆ బిల్లును ప్రవేశపెట్టగా, లైశ్రాం అచావ్‌సింగ్ దానికి ఈ విధంగా అభ్యంతరం తెలిపాడు.

'నా అభిప్రాయంలో ఈ చట్టం చేయవలసిన అవసరం లేదు, అది సమర్థనీయమూ కాదు. ఈ చట్టం కింద కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబోయే ప్రాంతాలలో ఇది చాలా సమస్యల్ని చిక్కుల్ని తెచ్చిపెడుతుంది. సైనిక అధికారులకు ఇటువంటి విశేష అధికారాలు ఇయ్యవలసిన

అవసరమేమిటో నాకు అర్థం కావడంలేదు. ఇప్పటికే సైనిక అధికారులు, ముఖ్యంగా కోహిమా మోకోక్‌చుంగ్ సబ్–డివిజన్ ప్రాంతాలలో, తరచుగా అత్యాచారాలకు పాల్పడుతున్నారనేది నేను గమనించిన విషయం. అటువంటప్పుడు వారికి విశేష అధికారాలు ఇవ్వడం నా దృష్టిలో సరయినది కాదు. ఈ మధ్యనే ఉత్తర కచార్ జిల్లా కేంద్రంలో ఒక ఘటన జరిగింది. నాగా తిరుగుబాటుదార్లను పట్టుకునే బదులు సైనిక సిబ్బంది కొందరు ఒక మృతుడయిన గిరిజన అధికారి ఇంటిపైన దాడిచేసి అతని భార్యపైన అత్యాచారం చేశారు. ఇటువంటి ఘటనల వల్ల ఇప్పటికే పరిస్థితి దిగజారింది. ఆ ప్రాంతంలో ఆదివాసులు సైనికులపైన తిరగబడుతున్నారు. కాబట్టి సైనిక సిబ్బందికి చంపడానికీ, అరెస్టు చేయడానికీ, ఇళ్లలోకి చొరబడడానికీ విశేష అధికారాలు ఇవ్వడం ప్రమాదకరం. మణిపూర్‌లోని ఆదివాసీ సబ్–డివిజన్స్‌లో సైన్యం వ్యవహరిస్తున్న తీరు గురించి నా వద్ద సమాచారం ఉంది. అక్కడ సైనికులు బలవంతంగా ప్రార్థనా స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ప్రజల నిరసనను ఖాతరు చేయడం లేదు. అక్కడి ప్రజలలో ఎక్కువ భాగం క్రైస్తవులు. వారు తమ చర్చిలను పవిత్ర స్థలాలుగా భావిస్తారు. అయితే సైనిక బలగాలు ఆ స్థలాలను బలవంతంగా ఆక్రమించుకుం టున్నాయి.'

ఇది 1958లో! ఈ జాబితాకు 'ఎన్‌కౌంటర్'లొక్కటి చేరిస్తే ఇవ్వాళ్టి కథగా దీనిని భావించవచ్చు.

## ఇంతకూ ఈ చట్టంలో ఏముంది?

సాధారణ పౌర పరిపాలనకు అండగా సైనిక బలగాలను పంపడం అవసరమయ్యేంతటి కల్లోలం ఒక ప్రాంతంలో నెలకొని ఉన్నట్టయితే, ఈ చట్టంలోని సెక్షన్ 3 కింద ఆ మేరకు గెజెట్ ప్రకటన చేసి సైన్యాన్ని అక్కడికి పంపుతారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసి ఉంటుంది. ఆ విధంగా (పౌర పాలనకు అండగా) పంపించబడ్డ సైన్యానికి విశేష అధికారాలు ఉంటాయి. ఎవరైనా ఒక వ్యక్తి చట్టాన్ని గానీ, నిషేధాజ్ఞలను గానీ అతిక్రమిస్తున్నట్టయితే అతని పైన ప్రాణం తీసేంత మోతాదులోనయినా సరే బలప్రయోగానికి సైనిక అధికారులు పాల్పడవచ్చు. బలప్రయోగానికి పూనుకునే ముందు ఎంత అవసరమనుకుంటే అంత హెచ్చరిక చేస్తే చాలు. సాయుధదాడులు చేయడానికి ఉపయోగించిన, లేక ఉపయోగించగల లేక ఉపయోగించడానికి ప్రయత్నించిన ఏ ఆవాసాన్నయినా అవసరమనుకుంటే ధ్వంసం చేయవచ్చు. నేరంలో నిందితులయి ఉండి పరారీలో ఉన్న వారికి గానీ, సాయుధ బృందాలకు గానీ ఆశ్రయం ఇస్తున్న నివాసానికి కూడా ఇది వర్తిస్తుంది. అనుమానితుడిని అరెస్టు చేసేటప్పుడు ఎంత అవసరమయితే అంత బలప్రయోగం చేయవచ్చు.

ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి లేదా నిర్బంధించిన వ్యక్తిని విడిపించడానికి లేదా దాచిపెట్టిన ఆయుధాలను, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకోవడానికి ఏ కట్టడంలోకయినా

ప్రవేశించవచ్చు, దానికి ఎంత అవసరమయితే అంత బలప్రయోగం చేయవచ్చు.

ఇవీ సెక్షన్ 4లో ఉన్న అధికారాలు. అరెస్టు చేసే అధికారం, సోదా చేసే అధికారం, నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకునే అధికారం మామూలు చట్టాలలో పోలీసులకు లేకపోలేదు. కానీ సాధారణ చట్టాలు నేర నిరోధక, నేర పరిశోధనలకు సంబంధించి ఒక సూత్రాన్ని అనుసరిస్తాయి. సమాజం మనుగడకు నేరాలను అరికట్టడం అవసరం. కాబట్టి నేరాలను నిరోధించడానికీ, పరిశోధించడానికీ పోలీసులకు కొన్ని అధికారాలు ఇవ్వడం అవసరం. ఈ అధికారాలు వారు వినియోగించేటప్పుడు పౌరులు కొన్ని హక్కులు, కొంత స్వేచ్ఛ కోల్పోతారు. అది సమాజం మనుగడ కోసం అందరూ భరించవలసిన నిర్బంధం. అయితే ఈ నిర్బంధం వీలయినంత తక్కువ ఉండేటట్టు చూడడం, ఈ అధికార దుర్వినియోగం నుండి వీలయినంత మేరకు రక్షణ ఉండేటట్టు చూడడం చట్టం వంతు. కాబట్టి ప్రతీ నిర్బంధ అధికారానికీ చట్టం షరతులూ, పరిమతులూ, పద్ధతులూ, మినహాయింపులూ నిర్దేశిస్తుంది. పోలీసులను అదుపుచేసే ఆచరణాత్మకమైన మార్గమేదీ లేకపోవడం వల్ల ఈ షరతులూ, పరిమితులూ వగైరా అనేక సందర్భాలలో నిరర్ధకమవుతున్నాయి గానీ సూత్రప్రాయంగా అవి సరయినవే.

అన్ని పరిమితులూ, మినహాయింపులూ, షరతులూ తీసేసి, బలప్రయోగం చేయడానికీ, ధ్వంసం చేయడానికీ సైన్యానికి అధికారం ఇవ్వడమేకాక, 'ఎంత అవసరమయితే అంత' చేసుకొమ్మనడం విచ్చలవిడి బలప్రయోగాన్ని చట్టబద్ధం చేయడం తప్ప వేరే ఏమీ కాదు. పైగా, ఈ చట్టం నుండి సంక్రమించిన అధికారాన్ని వినియోగించే క్రమంలో ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరిగినట్టయితే కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండ ప్రాసిక్యూట్ చేయడానికి వీలు లేదని సెక్షన్ 6 అంటుంది. ఆ అనుమతి దుర్లభం అని అనుభవం తెలుపుతుంది. ఈ చట్టాన్ని మానవహక్కులకు విఘాతం కలిగించేదిగా చూడడం, దానిని రద్దుచేయాలని కోరడం అందుకే.

తొలినాడు మణిపూర్‌లోని నాగాలు నివసించే కొన్ని ప్రాంతాలను మాత్రమే ఈ చట్టం కింద కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. కానీ మీయ్‌తీల నిరసన మిలిటెంట్ రూపం దాల్చిన క్రమంలో మరికొన్ని ప్రాంతాలను కూడా కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించసాగారు. 1980 సెప్టెంబర్ నాటికి రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌తో సహా మణిపూర్ రాష్ట్రం యావత్తూ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించబడింది.

ఈ లోపల – 1972లో – అంతకు ముందు అస్సాంలో భాగంగా ఉన్న ప్రాంతాలను వేరు చేసి కేంద్రపాలిత ప్రాంతాల ప్రతిపత్తి, లేక రాష్ట్రం ప్రతిపత్తి ఇచ్చిన కారణంగా 1972లో ఈ చట్టం పేరును సవరించి సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం అని నామకరణం చేశారు. అంతేకాక, ఒక భూభాగాన్ని ఈ చట్టం కింద కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే కాక కేంద్ర ప్రభుత్వానికి కూడా ఇచ్చారు. చట్టాన్ని చేసినప్పుడు గోవింద

వల్లభ్ పంత్ కేంద్ర హోం మంత్రి కాగా, ఈ సవరణ చేసినప్పుడు ఆయన కొడుకు కె.సి.పంత్ కేంద్ర హోంమంత్రి.

## 'ఎంత బలప్రయోగం అవసరమయితే అంత'

ఈ శీర్షిక కింద సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం అమలులో సైనిక, పారా మిలిటరీ బలగాలు ఎంత విచ్చలవిడిగా మారణకాండకు పాల్పడ్డారో తెలిపే ఘటనలు చూద్దాం. మా బృందం స్వయంగా పరిశీలించినవి మూడే కాబట్టి మొదటి నుండి సమాచారం సేకరిస్తూ ఆందోళన చేస్తున్న స్థానిక మానవహక్కుల సంఘాల నివేదికల నుండి కూడా ఇక్కడ ఉదంతాలను ఉదహరిస్తాం.

ఈశాన్య భారత రాష్ట్రాలలో 'భద్రత' నెలకొల్పే పనిలో నిమగ్నమయినది ప్రధానంగా అస్సాం రైఫిల్స్ అనే కేంద్ర ప్యారామిలిటరీ బలగం. ఇది కావడానికి ప్యారా మిలిటరీ బలగమే అయినప్పటికీ ప్రత్యక్షంగా సైన్యం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ బలగం అధికారులంతా డిప్యుటేషన్ మీద సైన్యం నుండి బదిలీ అయి వచ్చినవారే. మణిపూర్‌లోనయినా, నాగాలాండ్‌లోనయినా, అస్సాంలోనయినా 'అస్సాం రైఫిల్స్' అనేది ప్రజలందరి నోటా నలిగే పేరు. అది నిర్బంధానికీ, క్రూరత్వానికీ ప్రతీక.

ఇంఫాల్ పట్టణం నడిబొడ్డున కాంగ్లా కోట ఉంది. (మణిపూర్ సంప్రదాయకమయిన పేరు కాంగ్లీ పాక్). ఈ కోట శతాబ్దాలుగా మణిపూర్ రాజుల కోట. మణిపూర్ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన తరువాత అది మణిపురీ జాతి స్వతంత్ర అస్తిత్వానికి ప్రతీక అయింది. భారత పాలకులకు ప్రజలంటే – ముఖ్యంగా మారుమూల సరిహద్దు ప్రాంతాలలో నివసించే అల్పసంఖ్యాక ప్రజలంటే – ఎంత చులకనో తెలిపే ఒక దృష్టాంతంగా, కాంగ్లా కోటను అస్సాం రైఫిల్స్ హెడ్ క్వార్టర్స్‌గా మన పాలకులు మలచుకున్నారు. 'మీ ప్రభువు భారత సైన్యం సుమా' అని ఇంతకంటె నిస్సిగ్గుగా చెప్పడం కష్టం. కాంగ్లా కోట నుండి సైన్యాన్ని ఖాళీచేయించి తమకు అప్పగించాలన్నది మణిపురీల అనేక డిమాండ్లలో ఒకటి. ఈ 'చిన్న' కోరిక కూడా భారత్‌కు ఎక్కువయిపోయింది. మణిపురీలు బాగా ఒత్తిడి పెట్టినప్పుడు పగలు ఖాళీ చేయించడం, అర్ధరాత్రి మళ్లీ ఆక్రమించుకోవడం కూడా జరిగింది. మొన్న నవంబర్ 19న మన్మోహన్ సింగ్ దేశ ప్రధాని


నుపీలాన్ (స్త్రీల యుద్ధం) చిత్రం

హోదాలో ఇంఫాల్ వెళ్లినప్పుడు అస్సాం రైఫిల్స్‌ను బయటికి పంపి కాంగ్లా కోటను ఆ రాష్ట్ర పురావస్తు శాఖకు అప్పగించినట్టు వార్తలొచ్చాయి. ఇది ఎప్పటికీనో లేకపోతే రేపెప్పుడయినా పెద్ద ఘటన జరిగితే దానికి ప్రతిస్పందించే పేరుమీద అస్సాం రైఫిల్స్ మళ్లీ కోటను ఆక్రమించు కుంటుందో చూడాలి. ఎందుకంటే 'తీవ్రవాదం మీద పోరాటానికి అంతకంటే తగిన స్థావరం ఇంకొకటి లేదు' అనేది అస్సాం రైఫిల్స్ మణిపురీల డిమాండ్‌కు ఇస్తున్న జవాబు. రాజులు కట్టుకున్న కోటలు యుద్ధానికి తగిన స్థావరాలు కావడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. అయితే కాంగ్లా కోటను ఆ కోణం నుండి చూడడం ఉచితమా అన్నది విజ్ఞతగల పాలకులు వేసుకొని ఉండవలసిన ప్రశ్న. సరిహద్దు ప్రాంతాలలో భారత పాలకుల విజ్ఞత సైనిక అవసరా లకు బందీ కావడం వల్ల ఆ ప్రశ్న వారికి తోచలేదో, తోచికూడా అక్కరకు రాని సంశయం అనుకున్నారో మరి.

## సైనికుల హింసలో మైలురాళ్లు:

● 1980 నవంబర్ 21 పొద్దున 8.30 గంటల సమయంలో ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని బయినమ్ లీయ్‌కై వద్ద పెట్రోలింగ్ చేస్తున్న సైనిక బృందంపైన మిలిటెంట్లు దాడిచేశారు. ఒక జవాను చనిపోయాడు. అక్కడికి అర్ధకిలోమీటరు దూరాన చింగా గుట్టమీద సైన్యం క్యాంపు ఉంది. అరగంట పోయిన తరువాత ఆ క్యాంపు నుండి జవాన్లు వచ్చి బయినమ్ లీయ్‌కై మీద పడ్డారు. మతుం గుణీంద్రసింగ్, మహమ్మద్ వాహిద్ ఆలీ అనే ఇద్దరిని పట్టుకొని కొట్టి కాల్చి చంపారు. వాహిద్ ఆలీ ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. బయినమ్ లీయ్‌కైకి చెందిన మైబమ్ లక్ష్మణ్ అనే వ్యక్తిని చూడడానికి ఆరోజు తను ఆ ఊరికి వచ్చాడు. అతనితో పాటు వచ్చిన బాబు సింగ్‌ను లక్ష్మణ్ ఇంటి ఆవరణలో పట్టుకొని విపరీతంగా చిత్రహింసలు పెట్టారు. చిత్రహింసలు భరించలేక అతను చనిపోగా సైనికులతని శవాన్ని తీసుకుపోయారు. తరువాత అది ఇరిల్ నదిలో దొరికింది. సైనికుల దాడి చూసి భయపడిన మరొక గ్రామస్థుడు సలాం సమరేంద్రసింగ్ తన ఇంటి వెనక తలుపు నుండి పారిపోబోగా సైనికులు అతనిని పట్టుకొని విపరీతంగా కొట్టి తీసుకుపోయారు. మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో అతని శవం పొద్దున్న సైనిక పెట్రోలింగ్ బృందం పైన దాడిజరిగిన చోట లభించింది. మరొక 12 మందిని సైనికులు తీవ్రంగా హింసించగా వారు ఆస్పత్రి పాలయ్యారు. వారిలో ఒకరయిన మయెంగ్ బమ్‌కులా శాశ్వతంగా వికలాంగుడయ్యాడు.

● 1984 మార్చి 14న ఇంఫాల్‌లోని హైరాంగోయ్ తాంగ్ వాలీబాల్ గ్రౌండ్‌లో మణిపూర్ పోలీసు టీంకూ, సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) టీంకూ వాలీబాల్ పోటీ జరుగుతున్నది. మూడువేల మంది జనం ఆట చూస్తున్నారు. దగ్గరిలోనే కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సిఆర్‌పిఎఫ్) క్యాంపు ఉంది. క్యాంపు నుండి పదిమంది జవాన్లు తుపాకులేసుకొని ఆట

చూడడానికి వచ్చారు. గుంపులో నుండి కొందరు యువకులు ఆ జవాన్ల తుపాకులు గుంజుకొని పారిపోయారు. ఈ ఘటన చూసి జనం చెల్లాచెదరయ్యారు. అంతలో సిఆర్‌పిఎఫ్ క్యాంపు నుండి జవాన్లు వచ్చి వాలీబాల్ గ్రౌండ్‌కు ఉత్తర దిశన ఉన్న బ్రిడ్జిపైకి ఎక్కి జనం మీద కాల్పులు జరిపారు. గ్రౌండ్‌కు పశ్చిమ దిశగా ఉన్న రోడ్డు మీదికి కూడా తుపాకులు పట్టుకున్న జవాన్లు వచ్చారు. తూర్పున నది ఉంది, దక్షిణాన క్లబ్ బిల్డింగ్ ఉంది. ఎటూ పారిపోలేని జనం బుల్లెట్ల వర్షానికి బలయ్యారు. 13 మంది అక్కడికక్కడే చనిపోయారు. వారిలో ఒక 13 ఏళ్ల అబ్బాయి (సడోక్‌పామ్ లఖీకాంతసింగ్), ఒక 11 ఏళ్ల అమ్మాయి (సొయిబమ్ ధనవతీదేవి) ఉన్నారు. 31 మంది తీవ్రంగా గాయపడ్డారు.

● 1986 మే నెల 23–24 తేదీల మధ్య రాత్రి తామెంగ్‌లాంగ్ జిల్లా కేంద్రంలోనికి 25 మంది అస్సాం రైఫిల్స్ జవాన్లు, వారితోబాటు 'నాగాలాండ్ పీపుల్స్ మిలిషియా' అనే లొంగి పోయిన మిలిటెంట్ల గుంపు వచ్చారు. ఊరిలోని కమ్యూనిటీ హాల్‌లో బసచేసి అర్ధరాత్రి నాగా మిలిటెంట్ల వేటకు బయలుదేరారు. మిలిటెంట్లు దొరకలేదుగానీ తొమ్మిది మంది ఊరి ప్రముఖు లను తీసుకుపోయారు. వీరందరూ స్థానిక సంస్థలలో ఎన్నికయిన ప్రజా ప్రతినిధులుగా పని చేస్తున్నవారు, లేదా పనిచేసినవారు. వారిని తామెంగ్ లాంగ్‌కు మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న గోడాయ్‌చింగ్‌కు తీసుకుపోయారు. మూడు గంటల సేపు విపరీతంగా చిత్రహింసలు పెట్టగా టి.పి.ఇంజెలుంగ్ అనే హైస్కూలు హెడ్‌మాస్టరు, షాంఘువాంగ్ అనే పురప్రముఖుడు (ఈయన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూడా) చనిపోయారు. ఈ దౌర్జన్యం గురించి ఒక డిఐజి స్థాయి పోలీస్ అధికారి నేరపరిశోధన జరిపి హంతకులను గుర్తించి వారిని నేరవిచారణకు అప్పగించవలసిందిగా అస్సాం రైఫిల్స్‌కు అదేనెల 27వ తేదీన ఉత్తరం రాశాడు. 18 సంవత్స రాలు గడిచినా తదుపరి చర్య ఏదీ జరగలేదు.

● 1991 ఏప్రిల్ 3వ తేదీ రాత్రి చురాచంద్‌పూర్ జిల్లాలోని లుంతిలియన్ గ్రామానికి ఇం ఫాల్ నుండి సాయుధ పోలీసులు వచ్చి గ్రామ సర్పంచ్‌తో సహా ఆరుగురిని తీసుకుపోయారు. వీరు నాగాలు కారు, మీయ్‌తీలు కారు. హమార్ అనే అల్ప సంఖ్యాక తెగకు చెందినవారు. ఊరి బయట పోలీసులు సర్పంచ్‌ను విడిచిపెట్టి మిగిలిన వాళ్లను ట్రక్కులో తీసుకుపోయారు. 16 గంటలు ప్రయాణించిన తరువాత జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరాన వారిలో ఇద్దరిని బయటకు లాగి కాల్చి చంపారు. వారి పేర్లు లాల్ బీయ్‌క్లీన్, సాయ్‌కాప్లీన్. మిగిలిన వాళ్లను బాగా కొట్టి 13 రోజుల తరువాత కోర్టులో పెట్టారు. పోలీసులు 'ఎన్‌కౌంటర్' అని పేరుపెట్టిన ఈ ఘటనపైన రాష్ట్ర పియుసిఎల్ సుప్రీంకోర్టులో కేసు వేయగా సుప్రీంకోర్టు జిల్లా జడ్జిచేత విచారణ జరిపించి అది హత్యేనని నిర్ధారించి మృతులిద్దరి కుటుంబాలకూ లక్ష రూపా యల చొప్పున నష్టపరిహారం ఇప్పించింది. ఆ తీర్పు 1997లో వెలువడినప్పటికీ ఇప్పటికింకా

నష్టపరిహారం వారికి ముట్టలేదు, పోలీసుల పైన ఏ కేసూ పెట్టలేదు.

● 1993 ఆగస్టు 25వ తేదీ పొద్దున్న ఇంఫాల్ జిల్లాలోని తేరా కీయ్‌తెల్ సమీపం లోని సిఆర్‌పిఎఫ్ ఔట్‌పోస్టు జవాన్లు నీళ్లు తెచ్చుకోవడానికి వీధికొళాయి దగ్గరకు వెళ్లారు. చాటున ఉన్న మిలిటెంట్లు వారి పైన కాల్పులు జరిపారు. ఒక సిఆర్‌పిఎఫ్ జవాను చనిపోయాడు. తక్కిన జవాన్లు ఔట్‌పోస్టుకు హుటాహుటిన పోయి తమ వారిని పిలుచుకొని తుపాకులతో బయటి కొచ్చారు. వీధి కొళాయి దగ్గరికొచ్చి విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. పక్కనే ఉన్న చిన్న హోటల్ యజమానురాలు మెంచాదేవి (33) బుల్లెట్ల నుండి తనను తాను కాపాడుకోవడానికి నేలమీద పండు కునింది. అయితే సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఆమెను బయటికి గుంజి కాల్చి చంపారు. ఆమేకాక, విచ్చలవిడిగా జరిపిన ఈ కాల్పులలో ఖుంబాంగ్ మయుం ఆంగో (66) అనే రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, ముతుం అజిత్‌సింగ్ (33) అనే ప్రభుత్వ ఉద్యోగి, పుఖ్రాంబం బీహారీ అనే రిక్షా కార్మికుడు, నోంగ్‌తంబమ్ ధాకెషోర్ (72) అనే కార్పెంటర్ పనిచేసుకునే వృద్ధుడు చనిపోయారు.

హమార్‌లు ఈశాన్య భారతంలోని అతి చిన్నజాతి. వారు అస్సాంలో, మణిపూర్‌లో, మిజోరంలో ఉన్నారు. మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలలోనూ వారి జనాభా కొంత వుంది. మిజోరంలోని హమార్‌లలో కొందరు తమ భాషా సంస్కృతులను కాలక్రమంలో మరచిపోయి 'మిజో'లు అయిపోయారు గానీ తక్కినవారంతా ఒక జాతిగా మనుగడ సాగిస్తున్నారు.

1920లలో క్రైస్తవం పుచ్చుకున్న హమార్‌లలో విద్యాభివృద్ధి బాగా జరిగింది. అయితే కనీసం మూడు రాష్ట్రాలలో విస్తరించి ఉండడం వల్ల తమ జాతి అస్తిత్వాన్ని కాపాడుకోవడం వారికి కష్టతరమయింది. మిజోరంలో ఒక స్వయం ప్రతిపత్తి గల హిల్ కౌన్సిల్ తాము మెజారిటీగా నివసించే ప్రాంతంలో ఇవ్వాలన్న డిమాండ్‌తో హమార్ పీపుల్స్ కన్వెన్షన్ అనే సంస్థ ఆందోళన చేపట్టింది. ఆయుధాలు కూడా పట్టుకుంది. 1994లో వారికీ మిజోరం రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందంలో అటువంటి స్వయం ప్రతిపత్తి గల జిల్లా ఏర్పాటుకు ఒప్పుకోవడం జరిగిందిగానీ, దాని హద్దుల విషయంలో ఇప్పటికీ పంచాయతీ తెగలేదు. హమార్‌ల ఆందోళన ఆగనూ లేదు.

ఈ ఘటన గురించి పెద్దఎత్తునే ఆందోళన జరిగింది. ఆ రోజు సాయంత్రమే స్థానిక యువకులు, మీయ్‌రాపైబీలు నిరసన తెలుపుతూ మీటింగ్‌లు నిర్వహించారు. ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పరచి సెప్టెంబర్ 1 నాడు నిరసన ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. సెప్టెంబర్ 10 నాడు సిఓహెచ్‌ఆర్ అనే

## ఎన్‌కౌంటర్ అనేది 'అధికార హత్యాకాండ'

**లుం**తిలియన్ కేసు తీర్పులో సుప్రీంకోర్టు ఈ విధంగా అనింది. 'మణిపూర్ కల్లోలిత ప్రాంతం అన్నది సత్యమే. అక్కడ ప్రజా జీవిత భద్రతకూ, బహుశా దేశ భద్రతకూ కూడా భంగం కలిగించే టెర్రరిస్టుల కార్యకలాపాలు జరుగుతున్నట్టుంది. ఇటువంటి పరిస్థితులలో టెర్రరిస్టు కార్యకలాపాలను ఎదుర్కొనడానికి పోలీసులకు కొన్ని అసాధారణమైన అధికారాలు ఇవ్వడం అవసరమే కావచ్చు. టెర్రరిజాన్ని దృఢ హస్తంతో ఎదుర్కొనడం అవసరమే కావచ్చు. ఆ పనిలో నిమగ్నమైన పోలీసు, పారా మిలిటరీ బలగాలకు అదనపు అధికారాలు ఇయ్యడం కూడా అవసరమే కావచ్చు. ఈ ఘటనలో పోలీసులు చెప్పిన కథనం నిజమే అయివుంటే కోర్టు దానిలో జోక్యం చేసుకునే ప్రసక్తే ఉండేది కాదు. పోలీసులు తమ ప్రాణం పోయేదాకా కాచుకొని ఉండాలని ఎవరూ అనరు. ఎప్పుడు స్పందించాలో, ఏ విధంగా స్పందించాలో నిర్ణయించుకునేది వారే. టెర్రరిజం మీద ఏ విధంగా పోరాడాలో కోర్టులు చెప్పజాలవు... అయితే ఈ కేసులో జరిగిందేమిటంటే ఈ ఇద్దరు వ్యక్తులను, మరికొందరిని ఒక గుడిసెలో పట్టుకొని చాలాదూరం తీసుకుపోయి కాల్చి చంపడం. కల్లోలిత ప్రాంతాలలో సహితం ఈ రకమైన చర్యలను న్యాయస్థానాలు అనుమ తించవు. ఫలానా చోట టెర్రరిస్టులున్నారని పోలీసులకు తెలిసి, వారిని పట్టుకున్నట్టయితే వారితో చట్టం ప్రకారం నడుచుకోవాలే తప్ప ఈ రకమైన 'అధికార హత్యాకాండ'కు పాల్పడే అధికారం వారికి లేదు.'

మానవహక్కుల సంస్థ ఆధ్వర్యంలో ఇంఫాల్‌లో పెద్ద ప్రదర్శన జరిగింది. ఇంతాచేస్తే ఏమొచ్చిం దంటే మొదటి ముగ్గురు మృతులకు ఇరవై వేల రూపాయలు, ప్రభుత్వ ఉద్యోగి అయిన నాలు గవ మృతునికి అరవై వేల రూపాయలు, ముసలివాడని చెప్పి అయిదవ మృతునికి ఐదువేల రూపాయల నష్టపరిహారం ఇచ్చారు.

● మహమ్మద్ ఫరున్ ఇస్లాం తౌబాల్ జిల్లా తౌబాల్ మొయ్‌జింగ్ వంగ్ మటాబాకు చెందిన పదవ తరగతి విద్యార్థి. 28 అక్టోబర్ 1993 నాడు ఆ ఊరి పరిసరాలలో అస్సాం రైఫిల్స్‌కూ మిలిటెంట్లకూ మధ్య కాల్పులయ్యాయి. కాల్పుల అనంతరం అస్సాం రైఫిల్స్ జవాన్లు సోదా మొదలుపెట్టారు. మరుసటి రోజు రాయవలసిన పరీక్ష కోసం చదువుకుంటున్న ఇస్లాం గదిలోకి సోదాలో భాగంగా జవాన్లు వచ్చారు. అప్పటికి రాత్రి 11.00 అయింది. గోడమీద నక్షత్రం, తుపాకి బొమ్మ కనిపించింది. ఎందుకు వేసావని అడిగితే తన క్లాస్‌వర్క్‌లో భాగంగా వేశానని ఇస్లాం జవాబు చెప్పాడంట. (మిలిటెంట్ల మీద అభిమానం కొద్దీ వేశాడనే అనుకుందాం. అయితే ఏం?) జవాన్లు అతన్ని తౌబాల్‌లోని అస్సాం రైఫిల్స్ క్యాంపుకు తీసుకుపోయారు. అతని తండ్రి అబ్దుల్ ఖాదిర్ మరుసటి రోజు క్యాంపుకు పోయి తన కొడుకు గురించి వాకబు

చేయగా, పరీక్ష సమయం లోపలే విడిచిపెడతామని హామీ యిచ్చారు. అయితే పరీక్ష సమయానికి ఇస్లాం శవమే బయటికి వచ్చింది.

ఇస్లాం హత్య గురించి అతని తోటి విద్యార్థులు ఆందోళన చేయగా, 20 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ ఇస్లాం తండ్రి తీసుకోలేదు.

● తింగ్‌బైజమ్ ఓంగ్‌బి అంబ్రపతీదేవి (42) హైస్కూల్ టీచరు. 1992 నవంబర్ 20 రాత్రి ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని లంసాంగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యూకచార్ రోడ్ మీద ఆమె భర్త వెనుక స్కూటర్ మీద కూర్చొని పోతున్నది. సమయం రాత్రి 10.50 అయింది. వాళ్ల కొడుకు కూడా వాళ్లతో ఉన్నాడు. దారిలో మణిపూర్ రైఫిల్స్ పారామిలిటరీ బలగానికి చెందిన జవాన్లు రోడ్డుపక్కన జీప్సీ పెట్టుకొని ఉన్నారు. హెడ్‌లైట్లు వేసుకొని ఒకపక్కకు తిరిగి ఉన్న జిప్సీని చూసి ఏదయినా ప్రమాదం జరిగిందేమోనని అంబ్రపతీదేవి భర్త నబకుమార్ సింగ్ స్కూటర్ వేగం తగ్గించాడు. రోడ్డు రెండు వైపుల నుండీ మణిపూర్ రైఫిల్స్ జవాన్లు కాల్పులు జరిపారు. భార్యాభర్తలిద్దరూ స్కూటర్ దిగి దాని చాటున దాక్కున్నారు. అంబ్రపతీదేవికి అప్పటికే గాయం అయింది. నబకుమార్ గట్టిగా తాము నిరాయుధ పౌరులమని కేకలు పెట్టాడు. 'మీరు ఇక్కడి నుండి వెళ్లిపోండి' అని చీకటిలోనుండి ఒక గొంతు అరిచింది. వాళ్లు స్కూటర్ తీసుకొని పోదామని ప్రయత్నించగా, స్కూటర్ టైరుకు బుల్లెట్ తగిలి పంక్చర్ అయిందని గమనించారు. నబకుమార్ సింగ్ అతి కష్టంమీద భార్యను ఎత్తుకొనిపోయి పక్కనున్న షాపు వరండా మీద పడుకోబెట్టి తన కొడుకును ఎత్తుకొని డాక్టర్ కోసం పరుగెత్తాడు. రోగిని తీసుకురమ్మని డాక్టర్ అన్నాడు. నబకుమార్‌సింగ్ ఒక సైకిల్ తీసుకొని వెనక్కి వచ్చాడు. కానీ అప్పటికే అతని భార్య చనిపోయింది. ఒక గంటన్నర తరువాత పోలీసులొచ్చి 'తీవ్రవాదులను సమర్థిస్తున్నావు' అంటూ నబకుమార్ సింగ్‌నే నిందించారు! ఈ ఘటనకు నిరసనగా స్థానిక మీయ్‌రాపైబీలు, యువజన సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆరు రోజుల నిరవధిక బంద్ నిర్వహించారు. ప్రభుత్వం 60 వేల రూపాయల నష్టపరిహారం ఇచ్చిందిగానీ ఎవరిమీదా కేసు పెట్టలేదు, ప్రాసిక్యూట్ చేయలేదు.

● ఘోరమైన ఈ ఘటన నాగాలు ప్రధానంగా నివసించే తామెంగ్ లాంగ్ జిల్లాలో జరిగింది. 25 సెప్టెంబర్ 1994 తెల్లవారు జామున భారత సైన్యం జవాన్లు నుంగ్‌కావో గ్రామంలోకి ప్రవేశించి మూసి ఉన్న ఇళ్ల తలుపులు తట్టారు. కొద్దిసేపటికి తుపాకి తూటా చప్పుళ్లు వినిపించాయి. తలుపు తీసిన గ్రామస్థులను జవాన్లు గ్రామంలోని ఆటస్థలంలోకి రమ్మన్నారు. అప్పటికే మగవాళ్లు చాలామంది వెనక తలుపులు తీసుకొని చీకట్లోకి జారుకున్నారు. ఊరిలో ఉన్న వాళ్లంతా గుమిగూడిన తరువాత సైనికులు లంగ్‌బ్రామీ అనే వ్యక్తినీ, మరొక ముగ్గురినీ హియాంగ్‌పింగ్‌పౌ (వయసు 78) ఇంటికి తీసుకుపోయారు. ఆ ఇంటిలో ఇంటి యజమానే

కాక ధువాంగన్‌పౌ అనే చర్చి అధికారి కూడా ఉన్నాడు. సైనికులు ఆ యింటి తలుపు తట్టగా ఇంటి యజమాని తలుపు తీశాడు. సైనికులు నేరుగా కాల్పులు జరిపి అతనిని, ధువాంగన్‌పౌను గాయపరిచారు. ఆ తరువాత తమతో తెచ్చిన నలుగురినీ ఆ యింటిలోకి నెట్టి తలుపు బయటి నుండి గొళ్లెం పెట్టారు. ఇంటిని తగలబెట్టి మండుతున్న ఇంటిలోకి కాల్పులు జరిపారు. ఇంటి లోని వారిలో కొందరు వెనక నుండి తప్పించుకోగా, హియాంగ్‌పింగ్ పౌ, అతని కుమార్తె ఖుందింగ్ లుయ్ (30) ధువాంగన్‌పౌ సజీవంగా దహనమయి చనిపోయారు. వెనక నుండి పారిపోతున్న లంగ్‌బాౖమీని సైనికులు ఇంటి వెనక కాల్చి చంపారు. మొత్తం నలుగురు మృతి చెందారు. స్థానిక మానవహక్కుల సంఘాలు, నాగా సంఘాలు చాలా ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఏ స్పందనా లేదు.

● 1995 జనవరి 7వ తేదీన కేంద్ర పారామిలిటరీ పోలీసులు (సిఆర్‌పిఎఫ్) ఇంఫాల్‌లోని ప్రాంతీయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసి) వద్ద జరిపిన కాల్పులలో అయిదుగురు ఆటోడ్రైవర్లు, ఒక టాక్సీ డ్రైవరు, ఒక రిక్షా కార్మికుడు, ఒక ఉద్యోగి, ఒక మెడికల్ విద్యార్థి (మొత్తం తొమ్మిది మంది) చనిపోయారు. ముందురోజు రాత్రి డ్యూటీ చేసిన జవాన్లు ఆరోజు తెల్లవారి 7.00 గంటలప్పుడు వైద్య కళాశాల ఆవరణలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవ డానికి వస్తున్నారు. వారిమీద మిలిటెంట్లు కాల్పులు జరపగా ఒక జవాను కాలికి గాయం అయింది. దానితో రెచ్చిపోయిన సిఆర్‌పిఎఫ్ జవాన్లు 'మనవాడి మీద కాల్పులయ్యాయి! కాల్చండి, చంపండి!' అంటూ కేకలు వేశారు. అప్పుడు మోనీరిబా అనే మెడికల్ విద్యార్థి, తైమాయుమ్ ప్రదీప్‌కుమార్ అనే సులభ్ శౌచాలయ ఉద్యోగి, మరొక వ్యక్తి అటు వస్తున్నారు. ఆ మరొక వ్యక్తి ఈశాన్య రాష్ట్రాల వాడిలాగ లేదు. ఉత్తరాది రాష్ట్రాల వాడిలాగ ఉన్నాడు. సిఆర్‌పిఎఫ్ జవాన్లు అతనినేమీ అనకుండ మిగిలిన ఇద్దరిపైన నేరుగా కాల్పులు జరిపారు. వారిద్దరూ చేతులెత్తి తాము నిర్దోషులమని వివరించడానికి చేసిన ప్రయత్నాన్ని జవాన్లు పట్టించుకోలేదు. ఆ తరువాత కళాశాల తూర్పు గేటు వద్ద ఉన్న రిక్షా స్టాండ్ దగ్గరికి జవాన్లు వచ్చారు. అక్కడ ఇద్దరు రిక్షా కార్మికులున్నారు. ఒకతను చూడగానే స్థానికుడని తెలుస్తుంది. పేరు మహమ్మద్ జకీర్ హస్సేన్. రెండవతను చూడగానే ఉత్తరాదివాడని తెలుస్తుంది. జవాన్లు రెండవతన్ని పక్కకులాగి జకీర్ హుస్సేన్‌ను కాల్చి చంపారు. తరువాత పక్కనే ఉన్న ఆటోస్టాండ్ మీదికి నేరుగా కాల్పులు జరిపి అయిదుగురు ఆటో డ్రైవర్లను, ఒక టాక్సీ డ్రైవర్‌ను అక్కడికక్కడే కాల్చి చంపారు. ఆటోడ్రైవర్ల పేర్లు సైఖమ్ ప్రేమ్‌చంద్ (31), అంగొం దేబేంద్ర సింగ్, తొయ్‌జం రాథేభాయి (18), హిజమ్ ఖొగెన్ (27), రాజ్‌కుమార్ ఖొగెన్ (24), టాక్సీ డ్రైవరు వాంగ్‌ఖెమ్ ఉపేన్‌సింగ్ (24).

ఈ హత్యాకాండ గురించి పెద్దఎత్తునే ఆందోళన జరిగింది. ఆటోడ్రైవర్ల సంఘం, రిక్షా కార్మిక సంఘం తమ వాహనాలతో సహా అదేరోజు ఊరేగింపు తీశారు. లాఠీచార్జి, కాల్పులు



**నిజనిర్ధారణ కమిటీతో మాట్లాడుతున్న మీరాపైబీలు**

**'మీ**య్‌రాపైబీలు' (పలికేటపుడు మీరాపైబీలంటారు) మణిపూర్ (మీయ్‌తీ) సమాజంలోని ఒక విశిష్టమైన వ్యవస్థ. ఆ మాటకు అర్థం మహిళా వైతాళికులు అని. వీళ్లు వివాహిత స్త్రీలు. ప్రతీ ఇంట్లో ఒక వివాహిత స్త్రీ 'మీయ్‌రాపైబీ' కావాలి. అంటే సామాజిక కార్యకర్త కావాలి. సామాజిక జీవితంలో ఏదయినా సమస్య లేక సంక్షోభం తలెత్తినప్పుడు స్థానిక మీయ్‌రా పైబీలు ఎవరూ పురమాయించకుండానే తమంతట తాము రంగంలోకి దిగి దానిని పరిష్క రించే ప్రయత్నం చేస్తారు. ఇది ఎప్పటినుండో వస్తున్న సంప్రదాయం. వారి అలిఖిత అధికా రాన్ని అందరూ గౌరవిస్తారు. మణిపూర్‌లో మిలిటెన్సీ మొదలయిన తరువాత మీయ్‌రాపైబీలు తమంతట తాము ఒక కొత్త పాత్ర నిర్వహిస్తున్నారు. సైనిక జవాన్లు, పోలీసులు లేక మిలి టెంట్లు గ్రామంలోకి వచ్చి ఎవరినయినా కొట్టినా, బెదిరించినా, పట్టుకుపోయినా స్థానిక మీయ్‌రాపైబీలంతా వెంటనే జమ అవుతారు. వచ్చిన సాయుధులను నిలదీస్తారు. పట్టుకు పోయిన వ్యక్తిని విడిపించడానికి ఆందోళన చేస్తారు.

జరిగాయి. ప్రాంతీయ వైద్య కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది, జూనియర్ డాక్టర్ల సం ఘం సిఆర్‌పిఎఫ్ జవాన్లకు వైద్యం చేయొద్దని తీర్మానించి ఆరురోజులు సమ్మె చేశారు. ఇంఫాల్ నుండి ఢిల్లీ దాకా విద్యార్థి సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజాతంత్ర సంఘాలు ఊరేగింపులు, సభలు నిర్వహించారు. ఈ ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ హైకోర్టు జడ్జి డి.ఎం. సేన్ గారిని ఏకసభ్య విచారణ కమిషన్‌గా నియమించి విచారణ జరిపించింది. సిఆర్‌పిఎఫ్ జవాన్లు నిష్కారణంగా కాల్పులు జరిపారనీ, వాళ్ల మీద తొలుత కాల్పులు జరిపిన మిలిటెంట్లు నిష్క్రమిం చిన తరువాత నిరాయుధులపైన వారు కాల్పులు జరిపి హత్యచేశారనీ జస్టిస్ సేన్ కమిషన్ నిర్ధారించింది. అయినా దోషులపైన ఇప్పటిదాకా ఏ చర్యా తీసుకోలేదు.

● నగాంగ్‌బామ్ సంధ్యారాణీదేవి (30) కస్టమ్స్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేసేది. మంచి క్రీడాకారిణి. జాతీయస్థాయి ఆటల పోటీలలో మణిపూర్ తరఫున పాల్గొనింది. 1996 జులై 6వ తేదీన తౌబాల్ జిల్లాలోని పల్లేల్ వద్ద ఆమె పనిచేసే కస్టమ్స్ ప్రివెంటివ్ ఫోర్స్ కార్యాలయం ముందు నుండి అస్సాం రైఫిల్స్‌కు చెందిన మూడు ట్రక్కులు వెళ్లాయి. మూడు బండ్లూ పోగానే ఒక గ్రెనేడ్/ దొర్లుకుంటూ రోడ్డుమీదికి వచ్చింది. అప్పటికి అస్సాం రైఫిల్స్ వాహనాలు వెళ్లిపోయాయి. పైగా గ్రెనేడ్ పేలనూలేదు. అయినప్పటికీ జవాన్లు బండ్లు ఆపి వెనక్కి వచ్చి చుట్టుపక్కల ఉన్న ఇళ్లపైన కాల్పులు మొదలుపెట్టారు. ఆ గ్రెనేడ్‌ను నాగా పోరాటకారులు తమ వాహనాలపైకి విసిరారని వారి అభియోగం. ఆ సమయంలో ఒక ఫుట్‌బాల్ ఆట చూసి తన కార్యాలయం వైపు వస్తున్న సంధ్యారాణి ఈ దృశ్యాన్ని చూసి ఒక దుకాణంలోకి పరుగెత్తింది. అయితే అస్సాం రైఫిల్స్ తూటాలు ఆమెను వదలలేదు. ఆశ్రయం కోసం పోయిన షాపులోనే తూటా తగిలి పడి చనిపోయింది. క్రీడాకారుల సంఘాలు ఆందోళన చేయగా లక్ష రూపాయల నష్టపరిహారం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుందిగానీ ఎనిమిదేళ్లు గడిచినా దమ్మిడీ ఇవ్వలేదు.

● నుంగ్లీయ్‌బాన్ తామెంగ్‌లాంగ్ జిల్లాలోని నాగా గ్రామం. 1997 అక్టోబర్ 15వ తేదీన ఇంకా తెల్లవారక ముందే సాయుధ జవాన్లు ఆ గ్రామంలోకి ప్రవేశించారు. అప్పటికి సమయం 4.45. ఈశాన్య రాష్ట్రాలలో చాలా త్వరగానే తెల్లవారుతుందిగానీ అప్పటికింకా మసక మసకగానే ఉంది. ఎవరో సాయుధులు వస్తున్నారని గమనించిన గ్రామస్థులు వారిని కుకీ తెగకు చెందిన మిలిటెంట్లుగా భావించారు. నాగా, కుకీ ప్రజలకు మణిపూర్ కొండ ప్రాంతాలలో తీవ్రంగా ఘర్షణలు జరిగి వున్న కారణంగా వారు చాలా భయపడ్డారు. పారిపోగలిగిన వారంతా ఊరు వదిలి అడవులలోకి పారిపోయారు. వారు పారిపోవడం చూసి ఊరిలోకి కాల్పులు జరుపుకుంటూ ప్రవేశించిన సైన్యం తూటాలకు ముగ్గురు పసిపిల్లలు, ముగ్గురు స్త్రీలు, ముగ్గురు పురుషులు బలయ్యారు. స్త్రీలు సాధన (24), కాబీదోలుక్ (34), జెన్‌తుయ్‌లి (20). అయితే పిల్లలు రాయిచుయ్‌లుంగ్ (6), గైయ్ తొౌయ్‌పొయ్‌రు (6), లుతొౌయ్‌లుంగ్ (2). పురుషులు లుంగ్ తాపావొ (40), పౌరోతుయ్ (30), నెంగంలుంగ్ (22).

● 1999 జులై 21 నాడు పొద్దున్న 8.30కు సిఆర్‌పిఎఫ్ జవాన్లు చురాచంద్‌పూర్ జిల్లా కేంద్రంలోని దిగువ లయ్‌కా రోడ్డుమీద పెట్రోలింగ్‌కు పోయారు. చురాచంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు పావుకిలోమీటర్ దూరాన వారిపైన మిలిటెంట్లు కాల్పులు జరపగా ఒక హవల్‌దారుకు గాయమయింది. సిఆర్‌పిఎఫ్ జవాన్లు దానికి జవాబుగా చుట్టూ కాల్పులు జరపడం మొదలు పెట్టారు. స్కూలుకు పోవడానికని తన అక్కతో, తల్లితో ఇంటి నుండి బయటకు వస్తున్న అయిదవ తరగతి బాలుడు కిషన్‌కుమార్ (10) అక్కడికక్కడే తూటా తగిలి చనిపోయాడు. అతని సోదరికీ, తల్లికీ కూడా తూటా గాయాలయ్యాయి. ఆ తరువాత సమీపంలోని సిఎల్ మోటార్

వర్క్‌షాపులో పనిచేసుకుంటున్న మెకానిక్ లాల్శింగ్ తంగ్ హమార్ (22)ను జవాన్లు బయటకు గుంజి కాల్చి చంపారు. మరొక మోటార్ వర్క్‌షాపులో ఉన్న మనోజ్‌కుమార్ (30)ను కూడా బయటకు లాగి చంపారు. విచ్చలవిడిగా కొనసాగిన ఈ కాల్పులలో రోడ్డుమీద పోతున్న ఖామ్‌స్వన్‌మంగ్ సామ్టె (21), ఖమ్నమ్ కుమార్ సింగ్ (45) కూడా చనిపోయారు.

● 2000 సంవత్సరం నవంబర్ 2వ తేదీన జరిగిన మారణకాండకు వేరే ప్రత్యేకత ఏమీ లేదుగానీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రద్దుకోసం జరుగుతున్న ఆందోళన ఆనాటి ఘటనతో కొత్తరూపం తీసుకుంది.

ఇంఫాల్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న మాలోంలో బస్‌స్టాండ్ వద్ద బస్సు కోసం కాచుకొని ఉన్న ప్రజలపైన అస్సాం రైఫిల్స్ జవాన్లు విచ్చలవిడిగా కాల్పులు జరపగా పదిమంది అక్కడికక్కడే చనిపోయారు. మృతులు లైయ్‌సావ్‌బమ్ ఓంగ్ బీ సనా (52), అముక్ చమ్ రఘుమణి (35), ఒ యినమ్ సనతొంబా (50), కంగ్‌జమ్ బిజయ్ (35), గురుమయుం బాపు శర్మ, సినమ్ రాబిన్ (28), సినమ్ చంద్రమణి (18), తోక్చం శాంతి కుమార్ (19), ఖేత్రిమయుమ్ ఇవ్‌చా (20), సావ్‌బమ్ ప్రకాశ్ (20).

చెప్పుకోవడానికి సాకు కూడా దొరకని ఈ మారణకాండకు స్పందిస్తూ ఇరోమ్ చాను షర్మిలా అనే రచయిత్రి సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని పూర్తిగా రద్దుచేయాలంటూ ఆమరణ నిరాహార దీక్ష మొదలుపెట్టింది. మణిపూర్ ప్రభుత్వం ఆమె ముక్కులో గొట్టాలుపెట్టి బలవంతంగా ద్రవరూపంలో కొంత ఆహారం శరీరంలోకి ఎక్కిస్తుండడం వల్ల జీవచ్ఛవంలాగ నాలుగు సంవత్సరాలుగా బతికే వుంది. ఆమెను అరెస్టుచేసి జైలులో పెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాన్ని గౌహతి హైకోర్టు అడ్డుకోవడంతో ప్రభుత్వం ఆమెను ఆస్పత్రిలోనే నిర్బంధం లాంటి అదుపులో ఉంచింది. ఆమెను కలవడానికి సహితం ప్రభుత్వం అనుమతి కావాలి. మా బృందానికి అంత టైం లేక ఆమెను కలవలేకపోయాము.

● ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని ఖానావ్‌రిమ్ లీయ్‌కై గ్రామానికి చెందిన అతోక్‌పమ్ పూర్ణిమ (31), అతని భార్య వందన ఒకప్పుడు రివల్యూషనరీ పీపుల్స్ ఫ్రంట్ అనే మిలిటెంట్ సంస్థలో పనిచేశారు. 1996లో ఇద్దరూ సరండర్ అయి సాధారణ జీవితం గడుపుతున్నారు. 2001 సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన అస్సాం రైఫిల్స్ జవాన్లు వారి ఇంట్లోకి చొరబడి పూర్ణిమను అందరూ చూస్తుండగా కొట్టి తీసుకుపోయారు. అదే రాత్రి అతనిని మణిపూర్ విశ్వవిద్యాలయం ఆవరణలో కాల్చి చంపారు.

● ఇంఫాల్ తూర్పు జిల్లాలోని పాంగైబజార్ వద్ద 2002 ఏప్రిల్ 9 నాడు మధ్యాహ్నం 2.15కు మిలిటెంట్లు దాడిచేసి నలుగురు జవాన్లను చంపారు. దాడిచేసిన వారు పారిపోగా, సిఆర్‌పిఎఫ్ జవాన్లు చుట్టుపక్కల ఉన్న జనంపైకి విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఇద్దరు హైయర్

సెకండరీ విద్యార్థులను చంపారు. మృతులు యెంగ్‌ఖోమ్ సుర్బలాదేవి (18), అసేమ్ రంజిత్ సింగ్ (18).

● 2003 సంవత్సరం సెప్టెంబర్ 20 నాడు తౌబాల్ జిల్లా సుగ్నుబజార్‌లో కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలపైన మిలిటెంట్లు దాడిచేసినందుకు ప్రతీకారంగా వాళ్లు స్థానిక ప్రజలపైన విచ్చలవిడిగా కాల్పులు జరిపి నలుగురిని చంపారు. మృతులు – మొయిరంగ్ తెమ్ బిజంతి (25), జంఖోలెట్ (36), సైఖోలుంగ్ బైతె (43), తొంబా (35). మరుసటి రోజు సిఆర్‌పిఎఫ్ జవాన్లు మళ్లీ వచ్చి ఇల్లిల్లూ సోదాచేసి జనాన్ని విపరీతంగా కొట్టారు. ఈ దాడిలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

● 2004 మార్చి 15 తెల్లవారుజామున ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కారోంగ్ మమాంగ్ లీయ్‌కై గ్రామానికి చెందిన ఖుమాంతెమ్ అజిత్‌కుమార్ సింగ్‌ను సైనికులు అతని ఇంటి నుండి తీసుకుపోయారు. అతనికి కేవలం 19 ఏళ్ల వయస్సు. గతంలో గానీ, ఇప్పుడు గానీ ఏ మిలిటెంట్ గ్రూపుతోనూ అతనికి సంబంధాలు లేవని అతని తండ్రి మా బృందంతో అన్నాడు. వ్యవసాయం చేసేవాడు, కరాటె వగైరా 'మార్షియల్ ఆర్ట్స్' నేర్చుకునేవాడు. తెల్లవారి 3.00 గంటలకు సైనిక జవాన్లు వచ్చి అతనిని పేరుపెట్టి పిలిచి తీసుకుపోయారు. మొదట అతని తమ్ముడిని వాళ్లు లేపి పట్టుకోగా, అజిత్‌కుమారే ముందుకొచ్చి తన పేరు తాను చెప్పుకున్నాడు. సైనికులతనిని తీసుకుపోగానే తలిదండ్రులు గ్రామస్థులను నిద్రలేపి విషయం చెప్పారు. అంతా కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ అయిన లంసాంగ్ పోలీస్‌స్టేషన్‌కు పోయారు. పోలీసులు తమకేమీ తెలీదన్నారు. గ్రామ మీయ్‌రాపైబీలు ఆ ప్రాంత నివాసి అయిన ఒక మాజీ ఎంఎల్‌ఏ దగ్గరికి పోయారు. అతను కూడా వాకబు చేయడం మొదలుపెట్టాడు. ఆ క్రమంలో సెక్మాయ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖురుకుల్ దగ్గర ఒక యువకుడి శవం ఉందని తెలిసింది. అది అజిత్ కుమార్‌దేనని గుర్తించిన కుటుంబం, గ్రామస్థులు శవాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తూ అయిదు రోజులు ఆందోళన చేశారు. అతన్ని చంపడానికి కారణం ఏమిటో చెప్పాలన్నారు. ఇంటి నుండి తీసుకుపోయినప్పుడు మామూలు ప్యాంటు చొక్కా వేసుకున్న వ్యక్తి ఒంటిమీద చనిపోయిన తరువాత ఆలివ్ గ్రీన్ దుస్తులెట్లా వచ్చాయో చెప్పమన్నారు. చివరికి ఆ కేసును సిబిఐకి


అజిత్‌కుమార్ తల్లి

అప్పగిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాతే అజిత్‌కుమార్ అంత్యక్రియలు జరిగాయి.

● ఫీరోయ్‌జమ్ సనాజిత్‌సింగ్ (32) ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని నంగోడా అవాంగ్ లీయ్‌కా గ్రామానికి చెందిన యువకుడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతనికి మిలిటెంట్లతో సంబంధాలున్నాయన్న అనుమానం కారణంగా స్థానిక లామ్‌లాయి పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలలుగా 'హాజరు' వేస్తున్నాడు. 2004 మే నెల 30-31 మధ్య రాత్రి సైనిక జవాన్లు అతని ఇంటికి వచ్చి తలుపు తట్టారు. అతని అన్న మా బృందంతో చెప్పినదాని ప్రకారం వాళ్లు 'సనాజిత్ ఏడీ' అంటూ ఇంట్లోకి వచ్చి మరొక సోదరుడు ఇబోంచా సింగ్‌ను పట్టుకోగా అతని తల్లి 'అతను సనాజిత్ కాదు' అని గట్టిగా అరిచింది. వాళ్లతో ఉన్న ఇన్‌ఫార్మర్ సనాజిత్‌ను చూపించగా జవాన్లు ఇద్దరినీ పట్టుకొని బయటకు పోయారు. ఆ గ్రామం 'సమస్యాత్మకం' కావడం వల్ల ప్రతిరోజూ పదిమంది మీయ్‌రాపైబీలు గ్రామ కమ్యూనిటీ హాల్‌లో పండుకుంటున్నారు. వాళ్లు ఈ అలజడికి లేచివచ్చి 'మీకు కావలసింది సనాజిత్ ఒక్కడే అయితే ఇబోంచాను కూడా ఎందుకు తీసుకుపోతున్నారు' అని సైనికులను గద్దించారు. అప్పుడు వాళ్లు ఇబోంచాసింగ్‌ను విడిచిపెట్టి సనాజిత్ సింగ్‌ను మాత్రం తీసుకుపోయారు. అక్కడితో ఆగకుండా మీయ్‌రాపైబీలు స్థానిక (లామ్‌లాయ్) పోలీస్‌స్టేషన్‌కు పోయి సైనికులొచ్చి సనాజిత్ సింగ్‌ను పట్టుకుపోయారని చెప్పారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేడు, పొద్దున్న రమ్మని అక్కడి జవాన్ అన్నాడు. పొద్దున్న పోయేసరికి సైన్యం నుండి ఏ జవాబూ రావడం లేదని పోలీసులు అన్నారు. మీయ్‌రాపైబీలు సమీపంలోని రెండు అస్సాం రైఫిల్స్ క్యాంపులకు పోయి వాకబు చేయగా అక్కడ కూడా ఏమీ తెలియలేదు. చివరికి పోలీసులే సమాచారం ఇచ్చారు సనాజిత్ సింగ్‌ను తీసుకుపోయింది అక్కడికి 45 కి.మీ.లు దూరాన సెంజమ్ చిరాంగ్ వద్ద ఉన్న క్యాంపు సైనికులని. వారతనిని తెల్లవారి 3.45 గంటలకే క్యాంపు సమీపంలో మహాజన్ గొలాయి వద్ద చంపేశారు. ఇంటి నుండి టవల్ చుట్టుకొని పోయిన వాడి శవం ఆలివ్‌గ్రీన్ యూనిఫారంలో ఉంది.


సనాజిత్‌సింగ్ భార్య

● ప్రస్తుత ఆందోళనకు తక్షణ ప్రేరకమైన తంగ్‌జాం మనోరమాదేవి హత్య 2004 జులై 10-11 తేదీల మధ్య రాత్రి జరిగింది. ఆమె ఇంఫాల్‌కు ఐదు కి.మీ.ల

దూరాన ఉన్న బామొన్‌కంపు అనే గ్రామ నివాసి. ఒకప్పుడు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఏ) అనే మిలిటెంట్ సంస్థలో పనిచేసింది. తరువాత మానుకొని ఇంట్లోనే ఉంటూ ఉంది. మణిపూర్‌లో చేతి మగ్గాలు దాదాపు ప్రతీ ఇంట్లోనూ ఉంటాయి. మణిపూర్ సమాజంలో వైష్ణవం రూపంలో హైందవ మతం ప్రవేశించినప్పటికీ, బ్రాహ్మణులు, పంచములు, మరికొన్ని ఇతర కులాలు ఉన్నాయిగానీ ప్రతీ వృత్తికీ ఒక కులం లేదు. మగ్గం మీద పని గ్రామీణ స్త్రీలందరూ చేస్తారు. మనోరమ కూడా చేసేది. ఆమె శ్రమే కుటుంబానికి ప్రధాన ఆధారం అని మా బృం



మనోరమ ఇంటి ముందు....

దంతో మాట్లాడిన మనోరమ సోదరుడు అన్నాడు.

అతని కథనం ప్రకారం జులై 10 రాత్రి 12 గంటలకు అస్సాం రైఫిల్స్ జవాన్లు వాళ్ల ఇంటికి వచ్చారు. మొదట ఇంటి వెనకకు వెళ్లారు. తరువాత ఇంటి ముందుకొచ్చి తలుపు పగలగొట్టి లోపలికొచ్చారు. 'హెన్‌థాయ్' అన్న పేరుతో పిలిచారు. అది మనోరమ పిఎల్‌ఏలో పనిచేసినప్పుడు వాడిన మారుపేరు. ఆమె పలకలేదు. కానీ వారికామె రూపురేఖలు తెలుసును. ఆమెను పట్టుకొని ఇంటి ముందరి వరండాలోకి తీసుకుపోయారు. వరండాలో ఒక మూలకు ఆమెను తీసుకుపోయి ఇంటివాళ్లెవరూ బయటకు రాకుండా ముగ్గురు జవాన్లు తలుపుకు అడ్డంగా నిలబడ్డారు. ఆమె తల్లి మూడుసార్లు బయటకు రావాలని ప్రయత్నం చేయగా తలుపు దగ్గర కాపలా ఉన్న జవాన్లు ఆమెను కడుపులో తన్ని ఇంట్లోకి తోశారు. కిటికీలో నుండి చూడాలని ప్రయత్నించగా కిటికీ రెక్కలను తుపాకితో పొడిచారు.

అస్సాం రైఫిల్స్ జవాన్లు వరండాలో దాదాపు రెండున్నర గంటలున్నారు. బయట ఏం జరిగిందీ వినపడకుండా ఇంట్లోని టివిని పూర్తి వాల్యూంలో పెట్టారు. కొళాయిలు పూర్తిస్థాయిలో

తిప్పారు. మధ్యలో ఇంట్లోకి వచ్చి ఒక తాడు, పల్చటి తువ్వాలు, కూరగాయల కత్తి తీసుకు పోయారు. చివరికి 2.30 ప్రాంతంలో ఆమెను లోపలికి తీసుకొచ్చి బట్టలు మార్చుకోనిచ్చి తమతో తీసుకుపోయారు. తీసుకుపోయే ముందు చట్టబద్ధంగా అరెస్టు మెమో రాసి తల్లి కమలా దేవికి ఇచ్చారు (మనోరమకు తండ్రి లేడు). దానిలో ఆమెను సోదా చేసినట్లు, ఏ వస్తువు దొరకనట్టూ రాశారు. ఆమెకు పిఎల్ఏతో ఉన్న సంబంధాల గురించి ప్రశ్నించి పొద్దున్న స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపించేస్తామని చెప్పారు.

పొద్దున్న (అంటే జూలై 11 నాడు) మనోరమ కుటుంబ సభ్యులు స్థానిక (ఇరిల్‌బుంగ్) పోలీస్‌స్టేషన్‌కు పోయి వాకబు చేయగా అస్సాం రైఫిల్స్ వాళ్లు తమకు ఎవ్వరినీ అప్పగించలేదు గానీ వారి వాహనం ఒకటి 'ఈ దిశగా పోయింది' అని ఊరి బయట చేలవైపు చూపిస్తూ స్టేషన్ సెంట్రీ అన్నాడు. తిరిగి ఇంటికి రాగా చేలల్లో మనోరమ శవం కనిపించిందని గ్రామ స్థులు చెప్పారు. పోలీసులక్కడికొచ్చి ఆమె మృతదేహాన్ని తీసుకుపోయి శవపరీక్ష వగైరా జరిపించారు.

ఆమెను తామే చంపామని అస్సాం రైఫిల్స్ ఒప్పుకుంటున్నది. అయితే ముందు రాత్రి అరెస్టు కథ అబద్ధం అంటున్నది. మరి ముందు రాత్రి తల్లికి ఇచ్చిన అరెస్టు మెమో సంగ తేమిటి?దాని మీద అస్సాం రైఫిల్స్ 17వ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ (నెం. 173355) సురేష్‌కుమార్ సంతకం ఉంది. సాక్షులుగా రైఫిల్ మెన్ టి.లోథా (నెం.173916), అజిత్‌సింగ్ (నెం. 173491)ల సంతకాలూ ఉన్నాయి. వీటి సంగతేమిటన్న ప్రశ్నకు అస్సాం రైఫిల్స్ దగ్గర ఏ జవాబూ లేదు. లేకపోగా ఆమెను చంపిన తరువాత స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇచ్చిన రిపోర్టు లో, తమకు 10వ తేదీ రాత్రి బామొన్‌కంపు సమీపంలో పిఎల్ఏ గెరిల్లాలు సంచరిస్తున్నట్టు తెలిసిందనీ, అక్కడికిపోగా పిఎల్ఏ కార్పొరల్‌గా చెప్పుకుంటున్న మనోరమ ఉరఫ్ హెన్‌థాయ్ దొరికిందనీ, ఆమె దగ్గర గ్రెనేడ్, రేడియో సెట్, కొన్ని పత్రాలు దొరికాయనీ ఇంకా ఒక ఎకె 47 తుపాకీ కూడా ఉందనీ అది చూపిస్తానని తమను తీసుకుపోతూ దారిలో తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేసిందనీ ఆగమని వారించినా ఆగనందున కాల్పులు జరపవలసి వచ్చిందనీ, ఆ కాల్పులలో ఆమె చనిపోయిందనీ రాశారు. (అస్సాం రైఫిల్స్ పత్రికలకు విడుదల చేసిన ప్రకటన పూర్తి పాఠం విడిగా ఇస్తున్నాం).

ఇది మనకు అలవాటయిన ఎదురుకాల్పుల కథ కూడా కాదు. ఆమె జవాన్ల తుపాకులు లాక్కొని తిరగబడిందనో, వేరే ఏ రకంగానయినా జవాన్లకు ప్రాణాపాయం కలిగించిందనో అనలేదు. ఆమె పారిపోతున్నదట, ఆపడం కోసం కాల్చి చంపారంట. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం ఇచ్చే రక్షణే లేకపోతే అస్సాం రైఫిల్స్ జవాన్లు మనోరమను చంపే సాహసం చేద్దురా? అనేది మణిపురీల ప్రశ్న. చేయగలరని ఏ ప్రత్యేక చట్టమూ లేకున్నా కూడా పోలీసు హత్యాకాండ విచ్చలవిడిగా జరిగే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల వాసులం చెప్పగలం.

**మ**ణిపూర్‌కు – ప్రధానంగా మీయ్‌తీలకు – చెందిన ఆరు సంస్థలు 'పోటా'లో టెర్రరిస్టు సంస్థలుగా గుర్తింపు పొందాయని మొదట్లో అన్నాము. అవి:

పీపుల్స్ లిబరేషన్ (పిఎల్‌ఏ)

యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (యుఎన్‌ఎల్‌ఏ)

కాంగ్లీ పాక్ (ప్రీపాక్)

కాంగ్లీ పాక్ కమ్యూనిస్ట్ పార్టీ (కెసిపి)

కాంగ్లీ యావోల్ కన్‌బాలుప్ (కెవైకెఎల్)

మణిపూర్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ (ఎంపిఎల్‌ఎఫ్)

వీటిలో యుఎన్‌ఎల్‌ఎఫ్ మొత్తం ఈశాన్య భారతంలోనే అత్యంత సుశిక్షితమైన మిలిటెంట్ సంస్థ అంటారు.

ప్రస్తుతం నాగా సంస్థలతో నడుస్తున్న చర్చల కారణంగా ఆయుధాలు పక్కనపెట్టిన ఎన్‌ఎస్‌సిఎన్ (ఐ–ఎం), ఎన్‌ఎస్‌సిఎన్ (కె)లను కూడా కలుపుకుంటే – మణిపూర్‌లో నాగా ప్రాంతాలు విస్తృతంగా ఉన్నాయి కాబట్టి – మణిపూర్‌లోని మిలిటెంట్ సంస్థల సంఖ్య ఎనిమిదవుతుంది. ఇవి పెద్ద సంస్థలు మాత్రమే. చిన్నా చితక గ్రూపులను కలుపుకుంటే 20 దాకా ఉంటాయి. కాశ్మీర్‌లో సహితం ఇన్ని మిలిటెంట్ గ్రూపులు లేవు.

కానీ ఆ చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌ను ఆ కారణంగా నిరర్ధకమైన డిమాండుగా చూడడం పొరబాటవుతుంది. దానిని సైనిక పాలన అంతానికి డిమాండ్‌గా చూడడం ఉచితంగా ఉంటుంది.

## నిరసన

**తొ**లినాటి నుండీ మణిపూర్‌లోని నాగా ప్రాంతంలోనూ మీయ్‌తీ ప్రాంతంలోనూ కూడా ఈ క్రూరమైన అణచివేత పట్ల నిరసన ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతూనే ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాలకు – ముఖ్యంగా ఢిల్లీకి చెందిన హక్కుల సంఘాల అండ కూడా వారికి చెప్పుకోదగ్గ మోతాదులో లభించింది.

ఢిల్లీకి చెందిన పియుడిఆర్ సహాయంతో మణిపూర్‌లోని నాగాలు సుదీర్ఘంగా న్యాయపోరాటం చేసిన ఘటన – లేక ఘటనల పరంపర ఒయినమ్ గ్రామంలో 1987 జూలై–ఆగస్ట్ నెలలలో జరిగాయి.

ఒయినమ్ గ్రామం మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలో ఉంది. ఇక్కడ నివసించేది ప్రధానంగా మావో (లేక పౌమాయ్) తెగకు చెందిన నాగాలు. 1987 జూలై 9న ఆ గ్రామంలో ఉన్న అస్సాం రైఫిల్స్ క్యాంపు పైన ఎన్‌ఎస్‌సిఎన్ మిలిటెంట్లు దాడిచేసి తొమ్మిది మంది జవాన్లను చంపి పెద్ద మొత్తంలో ఆయుధాలూ, మందుగుండూ తీసుకుపోయారు. ఆ ఆయుధాలను తిరిగి స్వాధీనం చేసుకునే పేరు మీద అస్సాం రైఫిల్స్ జూలై 11 నుండి ఆగస్ట్ నెల చివరి దాకా ఆపరేషన్ బ్లూబర్డ్ అనే క్రూరమైన నిర్బంధ

మనోరమ మరణం గురించి అస్సాం రైఫిల్స్ విడుదల చేసిన ప్రకటన

## దెబ్బతీసిన అస్సాం రైఫిల్స్

**రా**ష్ట్రంలో మిలిటెన్సీని మరొకసారి దెబ్బతీస్తూ అస్సాం రైఫిల్స్ పిఎల్‌ఏకి చెందిన కరడుగట్టిన పేలుడు పదార్థాల కేడర్‌ను మట్టుబెట్టింది. 2004 జులై 10వ తేదీ రాత్రి బామొన్‌కంపు మయామ్ లీయ్‌కై వద్ద పిఎల్‌ఏ మిలిటెంట్లు సంచరిస్తున్నారన్న సమాచారం పొందిన అస్సాం రైఫిల్స్ సోదా చేపట్టి, పిఎల్‌ఏకి చెందిన కార్పొరల్‌గా పిలవబడే తంగ్‌జామ్ మనోరమ ఉరఫ్ హెన్‌థాయ్ ని అరెస్టు చేయడం జరిగింది. ఆమె వద్ద ఒక రేడియో సెట్, చేతి గ్రెనేడ్, వివిధ పత్రాలు దొరికాయి.

ఆమెను తరచి ప్రశ్నించగా తన దగ్గర ఎకె-47 తుపాకి ఉన్నదని చెప్పింది. తన రహస్య స్థావరానికి అస్సాం రైఫిల్స్ సైనికులను తీసుకుపోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. దారిలో బహిర్భూమికి పోవడానికి అనుమతి కోరింది. అయితే వాహనం నుండి దిగిన వెంటనే తప్పించుకునే ఉద్దేశంతో పరుగెత్తసాగింది. సైనికులు పరుగెత్తవద్దని హెచ్చరించినప్పటికీ ఆగ లేదు. గత్యంతరం లేక కాల్పులు జరపవలసి వచ్చింది. కాల్పులలో ఆమె చనిపోయింది.

అస్సాం రైఫిల్స్ ఇటువంటి ఘటనలకు మనస్ఫూర్తిగా చింతిస్తుంది. మనోరమ కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నది. అయితే మణిపూర్ ప్రజలకు విజ్ఞప్తి ఏమిటంటే దారి తప్పిన యువత కళ్లు తెరిపించండి, హింసా మార్గాన్ని వీడి తుపాకులు అప్పగించేసి ప్రధాన స్రవంతిలోకి రమ్మనండి.

వివిధ స్వచ్ఛంద సంస్థలు గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి చేసిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని అస్సాం రైఫిల్స్ కమాండర్ ఈరోజే ఢిల్లీ నుండి వచ్చిన ముఖ్యమంత్రితో ఈ విషయం చర్చించారు. స్వచ్ఛంద సంస్థల అనుమానాలు కమాండర్ గారికి తెలపడం జరిగింది. మనోరమ ఎటువంటిదయినప్పటికీ వారు ముఖ్యమంత్రికీ, మణిపూర్ ప్రజలకూ నిజాయితీగా ఆమె మృతి విషయంలో సానుభూతి తెలియజేశారు. వాస్తవాలు వెలికితీయడానికి సమగ్రమైన విచారణ జరుగుతుందని గౌ॥ ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.

కార్యక్రమాన్ని చేపట్టారు. చర్చిలలో క్యాంపులు నెలకొల్పి గ్రామాన్ని దిగ్బంధం చేశారు. ఆ గ్రామానికీ 30 పరిసర గ్రామాలకూ చెందిన 300 మందిని కరెంట్ షాక్‌లతో సహా అనేక రకాల చిత్రహింసలకు గురిచేశారు. 125 ఇళ్లను (తుపాకుల కోసం వెతికే పేరు మీద) కూల్చి వేసి తగలబెట్టారు. పది చర్చిలను కూల్చేశారు. పశువులను పంట చేలల్లోకి తరిమి పంటలు మేపించారు. 30 గ్రామాలలోనూ స్కూళ్లు మూసేయించారు. పశువులనూ, పందులనూ కాల్చి చంపారు. ఇళ్లు లూటీ చేసి ఇళ్లలోని విలువయిన వస్తువులు, డబ్బు తీసుకుపోయారు.

## సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రాజ్యాంగబద్ధమే, కానీ...

ఇవ్వాళ మణిపూర్ ప్రజలు రద్దు చేయాలని ఆందోళన సాగిస్తున్న ఈ చట్టం అసలు రాజ్యాంగ బద్ధమా అన్న సవాలును కోర్టు ముందుకు నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఫర్ హ్యూమన్ రైట్స్ తీసుకొచ్చింది. గౌహతి హైకోర్టు ఆ చట్టం రాజ్యాంగబద్ధం కాదని ప్రకటించింది గానీ సుప్రీం కోర్టు విభేదించింది. ప్రజల ప్రాణాలకూ స్వేచ్ఛకూ సంబంధించిన విషయాలలో విచ్చలవిడి అధికారమిచ్చే చట్టమేదీ చెల్లదు అనే రాజ్యాంగ సూత్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని చూసినట్ట యితే ఈ చట్టం నిజానికి చెల్లదు. కానీ చెల్లుతుందని రాజ్యాంగ ధర్మాసనం భావించింది. అదే సమయంలో, ఎంత అవసరమయితే అంత బలప్రయోగం చేసుకోవచ్చని చట్టం చెప్పే చోట కనీస బలప్రయోగం మాత్రమే చేయాలన్న షరతును చేర్చింది. ఈ చట్టం కింద ఒక వ్యక్తిని అరెస్టు చేసిన సైనిక బలగాలు వెంటనే అతనిని లేక ఆమెను స్థానిక పోలీసులకు అప్పగించాలనీ వారు వాళ్లను 24 గంటల లోపల కోర్టులో హాజరుపెట్టాలనీ స్పష్టం చేసింది. సోదా చేసేటప్పుడు, వస్తువులు స్వాధీనం చేసుకునేటప్పుడు సైనిక బలగాలు సాధారణ చట్టంలో పోలీసులకు వర్తించే నియమాలను పాటించాలనీ, స్వాధీనం చేసుకున్న వస్తువులను వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలనీ అనింది. నేర విచారణలో సైనికులు అత్యా చారానికి పాల్పడినట్టు తేలితే వారిని ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా అనుమతి ఇవ్వాలని చెప్పింది. సైనిక బలగాలు స్థానిక పాలనా యంత్రాంగానికి అండగా మోహరించబడ్డాయి కాబట్టి అండగానే ఉండాలి తప్ప దాని స్థానాన్ని ఆక్రమించడానికి వీలులేదని విశదీకరించింది.

ఒయినమ్, నిగంజుషా, ఖొంగ్‌డియ్ షింపుంగ్, ఖొంగ్‌డియ్ ఖుమన్, కొడెం ఖుల్లెన్, సోర్‌బుంగ్ అనే ఏడు గ్రామాల నుండి 50 లక్షల విలువగల సామాన్లు లూటీ అయ్యాయని అంచనా. 15 మంది చిత్రహింసల కారణంగా చనిపోగా, ఆరుగురు పిల్లలు సరయిన తిండిలేక, వైద్యం అం దక చనిపోయారు. ఆ గ్రామంలో జరుగుతున్న దారుణాన్ని గురించి విని పరామర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను, ఎంఎల్‌ఏలను సహితం అస్సాం రైఫిల్స్ క్యాంపులో నిర్బంధించి తుపాకులతో కొట్టడమే కాక, 'మమ్ములను చాలా బాగా చూసుకొని మంచి ఆతిథ్యం ఇచ్చారు' అని వేళాకోళంగా వారిచేత రాయించుకున్నారు కూడా. ఈ దమనకాండ గురించి మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తూ ఈ విధంగా అన్నాడు. 'సేనాపతి జిల్లాలో అస్సాం రైఫిల్స్ పౌర పాలనా యంత్రాంగాన్ని తృణీకరించి ప్రజలపైన అత్యాచారాలకు పాల్పడడంతో పౌర చట్టం తన ఉనికినే కోల్పోయింది. అస్సాం రైఫిల్స్ ఆ

ప్రాంతంలో సమాంతర పరిపాలన నిర్వహిస్తున్నది. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌నూ, డిప్యూటీ కమిషనర్‌ను (అంటే జిల్లా కలెక్టరు) అక్రమంగా నిర్బంధించి అవమానపరిచి తమ అధికారిక విధి నిర్వహణ చేయ కుండ ఆటంకపరిచారు!'

చనిపోయిన 15 మంది దీర్ఘమైన చిత్రహింసల అనంతరం చంపబడ్డారే తప్ప ఒక్కసారి తూటా పేలి చనిపోలేదు. పి.సాన్‌లాంగ్, వాఖావ్, బి.వా, పి.ఎల్. రింగ్ అనే నలుగురు ఒయినమ్ గ్రామస్థులను జూలై 10న అరెస్టుచేసి తీవ్రంగా హింసించి హింసించి జూలై 28న కాల్చి చంపారు. ఖొంగ్ డైఖుమన్ గ్రామ పెద్ద జామొను జూలై 11న అరెస్టుచేసి ఆగస్ట్ 8న కాల్చి చంపారు. అదే గ్రామానికి చెందిన థావాను జూలై 11న అరెస్టుచేసి రెండుసార్లు విడిచిపెట్టి మళ్లీ అరెస్టు చేసి ఆగస్ట్ 16న కాల్చి చంపారు. నగారీ విషాన్ గ్రామ పెద్ద పి.రంగ్‌ఖివోను జూలై 15న అరెస్టు చేసి ఆగస్ట్ 10-11 మధ్య రాత్రి కాల్చి చంపారు. అదే గ్రామానికి చెందిన స్థానిక సంస్థ సభ్యుడు ఆర్.మథోట్ మిని జూలై 11న అరెస్టుచేసి ఆగస్ట్ 10-11 మధ్య రాత్రి కాల్చి చంపారు.

దాదాపు రెండు నెలల పర్యంతం సాగిన ఈ దమనకాండ గురించి నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఫర్ హ్యూమన్‌రైట్స్ (ఎన్‌పిఎంహెచ్‌ఆర్), ఢిల్లీకి చెందిన పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ (పియుడిఆర్) విస్తృతంగా ఆందోళన చేయడమే కాక గౌహతి హైకోర్టులో కేసు కూడా వేశారు. హైకోర్టు ఇంఫాల్ సెషన్స్ జడ్జిచేత విచారణకు ఆదేశం ఇచ్చింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరం సాగిన ఈ విచారణలో చాలామంది సాక్ష్యం ఇచ్చారు. విపరీతమైన నిర్బంధాన్ని ఎదుర్కుంటూ తమ వాంగ్మూలాలు ఇచ్చారు. వాంగ్మూలాలు ఇచ్చినందుకు వాళ్లను అరెస్టు

## అపున్‌బా లుప్

**జూ**లై 11 నాడు మనోరమాదేవి హత్య జరిగింది. 12 జూలైనాడు మణిపూర్‌లోని ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అన్నీ కలిసి అపున్‌బా లుప్ అనే గొడుగు సంస్థను ఏర్పాటు చేసుకున్నాయి. అపున్‌బా అంటే అర్థం 'ఐక్య' అని. లుప్ అంటే 'సంస్థ'. ఇందులో 34 సంస్థలున్నాయి. ఆనాటి నుండీ ఈనాటి వరకు ఈ ఐక్య వేదిక మణిపూర్ లోయ ప్రాంతంలో ప్రజలను వేలాదిగా కదిలించి అన్ని ప్రజాతంత్ర రూపాలలోనూ ఆందోళన చేస్తున్నది. ఈ ఆందోళన డిమాండ్ ఒక్కటే. సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేయాలని. ధర్నాలు, ప్రదర్శనలు, వేల సంఖ్యలో జైళ్లను నింపే కార్యక్రమాలు చేపట్టారు. మా బృందం మణిపూర్ పోయేసరికి ఈ ఐక్యవేదిక బాధ్యులు 120 మంది జైలులో ఉన్నారు. అందులో జూలై 15 నాటి నిరసనలో పాల్గొన్న 12 మంది స్త్రీలలో అయిదుగురు కూడా ఉన్నారు! వారి మీద నేరారోపణ? రాజ ద్రోహం, భారత ప్రశాసనం పైన యుద్ధం చేయడం, యుద్ధానికి ఏర్పాట్లు చేయడం...

# నుపీలాన్,

**ను**పీలాన్ అంటే స్త్రీల యుద్ధం అని అర్థం. 1939లో మణిపూర్ మహిళలు చేపట్టిన పోరాటం ఆధునిక మణిపూర్ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. అది ప్రజాతంత్ర పాలనా సంస్కరణలకు నాంది అని ఆ ఘటన గురించి విస్తృతంగా రాసిన చరిత్రకారులు భావిస్తారు.

మణిపూర్ లోయ ప్రాంతంలో స్త్రీలు వ్యవసాయ ఉత్పత్తిలోనే కాక ఆహార ధాన్యాల వర్తకంలోనూ ప్రధానపాత్ర వహించేవారు. ఇంఫాల్‌లోని ఖ్వైరంబండ్ మార్కెట్‌లో అమ్మకందారులు అత్యధికంగా స్త్రీలే. మణిపూర్‌లో ప్రధాన వ్యవసాయ పంట వరి. బియ్యం అమ్మకానికి ఈ మార్కెట్ ముఖ్య కేంద్రం.

అయితే 20వ శతాబ్దపు తొలి సంవత్సరాల నుండి మార్వాడీ సేట్‌లు మణిపూర్‌లోకి ప్రవేశించారు. వీరు గ్రామీణ ప్రాంతాల నుండి వడ్లు నేరుగా కొనుక్కొని ఎగుమతి చేయసాగారు. అప్పట్లో మణిపూర్ పరిపాలన బ్రిటిష్ అజమాయిషీలో వున్న రాజు ద్వారా జరిగేది. 1921 తరువాత విపరీతంగా పెరిగిన ధాన్యం ఎగుమతిని అదుపు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ అది ఆగలేదు. 1938లో అపూర్వ స్థాయిలో ఎగుమతి జరిగింది.

ఇది ప్రజలను, ముఖ్యంగా స్త్రీలను, చాలా రకాలుగా ఇబ్బందులకు గురిచేసింది. బియ్యం ధర పెరిగింది. బియ్యాన్ని కాక వడ్లనే ఎగుమతి చేయడం వల్ల గ్రామాలలో కూలిపనులు తగ్గాయి. ఖ్వైరంబండ్ మార్కెట్‌లో అమ్మకందార్ల వ్యాపారమూ పడిపోయింది.

1939లో రెండవ ప్రపంచ యుద్ధం భారత్‌ను తాకడంతో సైన్యం అవసరాల కోసం ఎగుమతులు ఇంకా పెరిగాయి. విపరీతమైన వర్షాల వల్ల మణిపూర్ వరిపంట నష్టమూ అయింది. బియ్యం ధర దాదాపు రెండు రెట్లు అయింది. మార్కెట్‌లో బియ్యం స్టాక్ బాగా పడిపోగా, ఉన్న కొంచెం కొనుక్కోవడానికి ఎవరూ రాలేదు. ఈ స్థితిలో డిసెంబర్ 12 నాడు నుపీలాన్ ప్రారంభం అయింది. మార్కెట్‌లోని అమ్మకందార్లకు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారు – అందరూ స్త్రీలే – గుంపుగా రాజదర్బార్ వైపు వెళ్లారు. రాజు తీర్థయాత్రలకు పోయి ఉన్నాడు. రాజ దర్బార్‌కు ఒక బ్రిటిష్ అధికారి అధ్యక్షునిగా ఉండేవాడు.

గుంపుగా వస్తున్న ఆందోళనకారులను చూసి దర్బార్ సభ్యులు వెనుక ద్వారం నుండి తప్పించుకున్నారు గానీ అధ్యక్షుడు షార్ప్ దొరికిపోయాడు. ధాన్యం ఎగుమతిని వెంటనే

# 1939



బ్రిటిష్ సైనికులతో పోరాడుతున్న మణిపూర్ స్త్రీల స్థూపం

ఆపమని ఆందోళనకారులతనిని అడిగారు. రాజాజ్ఞ లేకుండా నేనెట్లా ఆపేది అని అతను తిరస్కారంగా జవాబు ఇచ్చాడు. అయితే రాజుకు టెలిగ్రాం ఇద్దువు పద అని స్త్రీలు అతనిని టెలిగ్రాఫ్ ఆఫీసుకు తీసుకుపోయారు.

టెలిగ్రాం ఇచ్చిన షార్ప్, ఇచ్చాను కదా ఇంక నన్ను పోనివ్వండి అన్నాడు. వీలులేదు, రాజు నుండి జవాబు వచ్చేదాకా నువ్విక్కడే ఉండాలి అని వారతనిని టెలిగ్రాఫ్ ఆఫీసులో నిర్బంధించారు. మధ్యాహ్న భోజన సమయానికతను నేను భోజనం చేయాలి, నన్ను పోనివ్వండి అన్నాడు. దానితో స్త్రీలు రెచ్చిపోయారు. మేమంతా రెండు రోజులుగా ఏమీ తినలేదు, నువ్వు రెండు గంటలు ఉపవాసముంటే నీకు ఆకలేమిటో అర్థం అవుతుందిలే అన్నారు. 'మణిపూర్ మాతాకీ జై' అంటూ నినాదాలు ఇచ్చుకుంటూ అతనిని చుట్టుముట్టి వారూ జవాబు కోసం ఎదురుచూస్తూ అక్కడే ఉండిపోయారు.

మధ్యాహ్నం రెండు గంటలకు షార్ప్‌ను విడిపించడానికి అస్సాం రైఫిల్స్ రంగంలోకి దిగింది. ఆందోళనకారులను చితకబాదారు. టెలిగ్రాఫ్ భవనం ఒకటవ అంతస్తులో ఉన్న వారిని కిందికి విసిరేశారు. తుపాకీ మొనతో పొడిచారు. కింద పడిన వారిని బూటుకాళ్ల తో తొక్కారు. రాత్రిదాకా సాగిన ఈ దమనకాండలో 21 మంది స్త్రీలు తీవ్రంగా గాయ పడ్డారు. కానీ విజయం సాధించారు. రాజు నుండి పొద్దున్న టెలిగ్రాం వచ్చింది– ధాన్యం ఎగుమతులు మొత్తం ఆపేయమని.

చేశారు, కరెంటు షాకులు ఇచ్చి హింసించారు, కేసులు పెట్టి జైలుకు పంపారు. అయినప్ప టికీ సాక్షులు విచారణ ముందు హాజరవుతూనే ఉన్నారు.

మరొక పక్క నిరసన ఉద్యమమూ కొనసాగింది. అంతర్జాతీయ మానవహక్కుల దినం అయిన డిసెంబర్ 10, 1988 నాడు మణిపూర్‌కు చెందిన అన్ని రాజకీయ పార్టీలు (అప్ప టి పాలక పార్టీ కాంగ్రెస్ తప్ప), హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌తో ప్రదర్శన చేపట్టారు. అదే రోజు ఉఖ్రుల్ జిల్లా కేంద్రంలోనూ ఎన్‌పిఎంహెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది.

సైనిక నిర్బంధం మణిపూర్‌లోని నాగాలపైన 1950ల నుండి ఉండగా, మీయ్‌తీలు దానిని కొంత ఆలస్యంగా రుచి చూశారు. మీయ్‌తీ జాతీయవాదం ప్రతినిధిగా యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్‌ఎల్‌ఎఫ్) 1964లో స్థాపించబడింది. 1980ల చివరి దాకా అది ఒక సామాజిక ఉద్యమ సంస్థగా ఉండింది. ఆ తరువాత ఆయుధాలు పట్టుకొని ప్రస్తుతం బలమైన సాయుధ పోరాట సంస్థగా వుంది. ప్రీపాక్, పిఎల్‌ఏలు 1977, 78 సంవత్సరాలలో ఏర్పడ్డాయి. వారి అండర్‌గ్రౌండ్ కార్యకలాపాలు విస్తరించిన క్రమంలో సాయు ధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం కింద కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన భూభాగమూ పెరిగి, 1980 సెప్టెంబర్ 8 నాటికి యావత్ మణిపూర్ రాష్ట్రాన్ని ఆ ప్రకటన ఆక్రమించు కునింది.

అయితే సైనికులు ఎక్కడ అత్యాచారాలకు పాల్పడినా మణిపురీ సమాజంలో నిరసన బాహా టంగా వ్యక్తమయింది. మీయ్‌రాపైబీల రూపంలో, సామాజిక సమస్యల పరిష్కారంలో స్త్రీలకు సంప్రదాయకంగానే ఒక ప్రత్యేక పాత్ర ఇచ్చిన మీయ్‌తీ సమాజం నిర్బంధానికి చూపిన ప్రతిఘటనలో తరచుగా స్త్రీలే ముఖ్య పాత్ర నిర్వహించారు.

మనోరమాదేవి హత్య అనంతరం మణిపూర్‌లో ఉవ్వెత్తున లేచిన నిరసన ఉద్యమం గురించి ఇప్పటికే పత్రికల పుణ్యాన మనకు కొంత తెలుసు. జూలై 15న 12 మంది స్త్రీలు 'భారత సైనికులారా మమ్మల్ని రేప్ చేయండి!' అన్న బ్యానర్ పట్టుకొని ఇంఫాల్ కాంగ్లా కోటలోని అస్సాం రైఫిల్స్ హెడ్ క్వార్టర్స్ ఎదుట నగ్నప్రదర్శన నిర్వహించిన చిత్రం అన్ని పత్రికలూ ప్రచురించాయి. అది మణిపురీల నిరసనోద్యమానికి చిహ్నం అయింది.

ఆ 12 మంది స్త్రీలలో ఏడుగురిని మా బృందం కలిసింది. మిగిలిన అయిదుగురు అప్పటికి జైలులో ఉన్నారు. ఈ ఏడుగురూ కూడా ఏ క్షణమైనా అరెస్టు కావచ్చునన్న ఆందోళనతో ఉన్నారు. వీరంతా వివిధ మహిళా సంఘాల బాధ్యులు. కీయ్‌షంతరుణి, తొక్‌చొం రమణి, అఖిల మణిపూర్ సామాజిక సంస్కరణ, అభివృద్ధి సమాజ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. ఫాంజొంగ్‌బమ్ సఖి అపున్‌బా మణిపూర్ కన్‌బా ఇమ్మాలుప్ అనే సంస్థ ఉపాధ్యక్షురాలు. యుమ్‌లెమ్‌బమ్ మేమ ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి. ముటుం ఇచెంహాల్ అఖిల మణిపూర్

తమీచింగ్‌మి అపున్‌బా లుప్ అనే సంస్థ అధ్యక్షురాలు. తియమ్ నళిని ఆ సంస్థ కోశాధికారి. అకిజామ్ జానకి మొమ్‌ను ఎరిఖోంబి లుప్ అనే సంస్థ అధ్యక్షురాలు. వీరెవ్వరికీ 50 సంవత్సరాలకు తక్కువ వయసు లేదు. వీరు బాధ్యులుగా ఉన్న సంస్థలన్నీ అపున్‌బా లుప్ అనే ఐక్యవేదిక భాగస్వామ్య సంస్థలే. ప్రస్తుత మణిపూర్ ఆందోళన అపున్‌బా లుప్ ఆధ్వర్యంలో జరుగుతున్నది.

'నలభై సంవత్సరాలకు పైగా ఈ చట్టాన్ని మేము భరిస్తున్నాము. మొదట తామెంగ్‌లాంగ్ జిల్లాలో ప్రారంభమయింది. 1980 తరువాత రాష్ట్రమంతటా అమలవుతున్నది. చాలామంది అమాయకులను చంపారు. ఇంకెన్నాళ్లిట్లా అని మాలో మేము మాట్లాడుకొని నగ్న ప్రదర్శన చేయాలని నిర్ణయించుకున్నాము. రాజులు పరిపాలించిన రోజులలో ఇటువంటివి జరిగేవి కావు. ఎవరయినా నేరం చేస్తే శిక్షించేవారు. ఇప్పుడు? మణిపూర్‌లో ఎన్ని ఘటనలు జరుగు తున్నాయి? ఎవరినైనా శిక్షిస్తున్నారా?... కలకత్తాలో ధనుంజయ్ ఛటర్జీ ఒక అమ్మాయిని రేప్ చేసి చంపాడని ఉరితీశారు. మరి మనోరమను రేప్ చేసి చంపిన వారినెందుకు శిక్షించరు? పూర్వ కాలంలో సహితం మణిపూర్ స్త్రీలకొక సంప్రదాయం ఉండేది. రాజ్యం మేలుకోసం ఏం చేయగలమా అని స్త్రీలు పోగయి ఆలోచించుకునే వారు. శత్రువులు రాజ్యం మీద దాడి చేస్తే వారిని ప్రతిఘటించేవారు... అది మా సంప్రదాయం' – ఇదీ తమ నిరసన ప్రదర్శన గురించి వారు చెప్పుకున్న విషయం.

ఆ తరువాత మణిపురీలు అపున్‌బా లుప్ ఆధ్వర్యంలో జైల్ భరో ఉద్యమం పెద్దయెత్తున చేపట్టారు. వేల సంఖ్యలో జనం పోలీస్‌స్టేషన్ల ఎదుట ప్రదర్శనలు జరిపి తమను అరెస్టు చేయ మని సవాలు చేశారు. పోలీసులు లాఠీచార్జి చేశారు, బాష్పవాయువు ప్రయోగించారు. నిరాయు ధులయిన ప్రజలకూ సాయుధ పోలీసులకూ మధ్య ఒక రకమైన యుద్ధ వాతావరణం కొన్ని వారాల పాటు ఏర్పడింది.

ఆగస్ట్ 15ను మణిపురీలు నిరసన దినంగా పాటించారు. ఆరోజు బిష్ణుపూర్‌లో పెబామ్ చిత్తరంజన్ అనే విద్యార్థి నాయకుడు ఆత్మాహుతి చేసుకున్న విషాద సంఘటన జరిగింది. భారత సైన్యం వెనక్కిపోవాలనీ ఈశాన్య రాష్ట్రాల నుండి సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ తనను తాను మానవ కాగడాగా మలచుకొని బహిరంగంగా తగలబడి చనిపోవాలని తాను నిర్ణయించుకున్నట్టు ఈ యువకుడు ఆగస్ట్ 13న మణిపురీ ప్రజల నుద్దేశించి ఒక ఉత్తరం రాశాడు. అందులో తంగ్‌జం మనోరమ హత్యనే కాక అంతకు ముందు సేనాపతి జిల్లాలో సైన్యం చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న కుకీ తెగకు చెందిన క్రైస్తవ పాస్టర్ జమ్‌ఖొలెట్ ఖొంగ్‌సాయ్ హత్యను కూడా ప్రస్తావించాడు. 'విడివిడిగా' కొట్లాడొద్దు, కలిసి కొట్లాడండి అని మణిపూర్‌లోని వివిధ తెగలకు పిలుపు ఇచ్చాడు. తల్లికీ

తండ్రికీ అన్నకూ అక్కకూ చెల్లెకూ అప్పగింతలు పెట్టాడు. ఢిల్లీలోని తమ యజమానులు విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం ఎదురుచూస్తూ బానిసలుగా బతుకుతున్న మణిపూర్ నాయకులకు బుద్ధిచెప్పాలి అన్నాడు. నిర్బంధ చట్టాల కింద నలిగి చనిపోయే కంటే వాటికి వ్యతిరేకంగా నినదిస్తూ ప్రాణార్పణ చేయడం మేలు అనే నిర్ణయానికి వచ్చి ఈ పని చేస్తున్నానన్నాడు.

ఆగస్ట్ 15న చిత్తరంజన్ ఒంటి మీద కిరోసిన్ పోసుకొని అగ్గి అంటించుకొని సాయుధ



**చిత్తరంజన్ తల్లిదండ్రులు**



**చిత్తరంజన్**

**చి**త్తరంజన్ ఆత్మాహుతి నిర్ణయం స్వంత నిర్ణయమే కావచ్చు. కానీ అతని తోటి ఉద్యమకారులకు అది తెలుసు. కాబట్టే ఆ నిరసనను టివి కెమెరాలో వారు బంధించారు. అతను ఆగస్ట్ 13 నాడు ఆఖరి ఉత్తరం రాస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించారు. 15 నాడు ఒంటిమీద కిరోసిన్ పోసుకొని అగ్గి పెట్టుకుంటున్న దృశ్యాన్నీ, పరుగెత్తి తగలబడి విలవిల తన్నుకుంటున్న దృశ్యాన్నీ కూడా చిత్రీకరించారు. పోలీసులకు కూడా జోక్యం చేసుకోవద్దన్న విన్నపమో ఆదేశమో ఉన్నట్టుంది. వాళ్లు కూడా చూస్తూ ఊరుకున్నారు. ఆ తరువాత అపున్‌బాలుప్ ఆ క్యాసెట్‌ను ప్రచారం కోసం వాడుకుంటున్నది.

అపున్‌బాలుప్ నిర్వహిస్తున్న ఆందోళన పట్ల మాకు గౌరవం ఉంది. వారి లక్ష్యంతో ఏకీ భావం ఉంది. వారు ఎదుర్కుంటున్న నిర్బంధం విషయంలో సానుభూతి ఉంది. అయినప్పటికీ ఈ నడవడిక అనైతికం అని ప్రకటించక తప్పదు.



రోడ్‌రోకో చేస్తున్న మీరాపైబీలు

**మా** బృందం ఆఖరిరోజు మధ్యాహ్నం ఇంఫాల్‌కు తిరిగి వస్తుండగా నగరంలోకి ప్రవేశించే రహదారిని కొందరు స్త్రీలు బంద్ చేయిస్తున్న దృశ్యం కనిపించింది. మా వాహనాన్ని కూడా ఆపారు. మేము ఫలానా అని పరిచయం చేసుకోగా తాము స్థానిక మీయ్‌రాపైబీలమనీ, ఆ రోజు (అక్టోబరు 20) పొద్దున్న ఒక వ్యక్తిని పోలీస్ జీపు డ్రైవర్ కాల్చి చంపినందుకు నిరసనగా నగరంలోని ఉరిపోక్ ప్రాంతంలో బంద్ జరుపుతున్నామనీ వివరించారు. ఆ జీపు పట్రోయి పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి అయిన అధికారిది. రద్దీగా ఉన్న ఒక గల్లీలో ఆ జీపు వేగంగా దూసుకుపోతూ, దానిలో కూర్చున్న జవాను లాఠీతో జనాన్ని ఇటూ అటూ చెదర గొడుతున్నాడంట. స్కూటర్ మీద ఆ గల్లీలోకి వచ్చిన రాజ్‌కుమార్ సనజేబాసింగ్ ఈ దృశ్యం చూసి కోపగించి స్కూటర్‌తో పోలీస్‌జీపును ఓవర్‌టేక్ చేసి దానికి అడ్డంపెట్టి గొడవకు దిగాడు. అతను మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి రాజ్‌కుమార్ జైచంద్రసింగ్ తమ్ముని కొడుకు కావడం వల్లనేమో భయపడలేదు. అయితే జీపు దిగి పోలీసులతనిని కొట్టారు. అతను లాఠీ గుంజుకొని తిరిగి కొట్టాడు. వాళ్లతనిని కిందపడేసి కాల్చి చంపారు.

'ఘటన జరగగానే ఇంతమంది స్త్రీలు ఎట్లా పోగయ్యారు?' అని అడిగాం. 'ఒక మీయ్‌రా పైబీకి తెలియగానే ఆమె బయటికి పోయి కరెంటు స్తంభం మీద గట్టిగా కొడుతుంది. అది మిగిలిన వాళ్లకు సంకేతం' అన్నారు.

దళాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్న నినాదం ఇస్తూ పరుగెత్తి గాలిలో ఎగిసిన మంటలలో పూర్తిగా కాలి రోడ్డు పక్కన పడిపోయాడు. 16వ తేదీనాడు చనిపోయాడు.

జూలై 15తో మొదలుపెట్టి కొన్ని వారాలపాటు ఉధృతంగా సాగిన అపున్‌బా లుప్ ఉద్య

మాన్ని అణచివేయడానికి మణిపూర్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధానికి పూనుకుంది. జైల్ భరో కార్యక్రమంలో భాగంగా 'మమ్మల్ని అరెస్టు చేయండి' అని పోలీస్‌స్టేషన్ల వద్ద ప్రదర్శనలు నిర్వహించిన జనం పైన లాఠీలు బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు వివిధ పోరాట సంస్థల కార్యకర్తలు, నాయకుల పైన అత్యంత తీవ్రమైన అభియోగాలతో కేసులు పెట్టారు. ఐపిసి సెక్షన్ 121 (భారత ప్రభుత్వం పైన యుద్ధం చేయడం), సెక్షన్ 124-ఎ (రాజద్రోహం) మొదలయిన అభియోగాలతో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. కొందరిపైన జాతీయ భద్రతా చట్టాన్ని కూడా ప్రయోగిస్తున్నారు.

మా బృందం మణిపూర్ పోయే నాటికి 126 మంది కార్యకర్తలు ఈ రకమైన కేసులలో అరెస్టయి ఉన్నారు. వీరిలో 17 మంది 50 నుండి 74 సంవత్సరాల వయసున్న వారు (అందులో 15 మంది స్త్రీలు). 33 మంది 15 నుండి 19 సంవత్సరాల వయసున్న లేత వయసు పిల్లలు. అరెస్టు కాకుండ బయట ఉన్నవారు ఏ క్షణమైనా తమను అరెస్టు చేయవచ్చునన్న భయంతో రాత్రిళ్లు స్నేహితుల ఇళ్లలో పండుకునే స్థితి ఉండింది.

నవంబర్ నెలలో దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇంఫాల్ వెళ్లిన సందర్భంలో ఈ 126 మందినీ విడిచిపెట్టినట్టు వినికిడి. కానీ వారి అసలు కోరిక సంగతేమిటి? సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రద్దుచేయాలన్న డిమాండ్ గురించి ప్రభుత్వం ఏమీ మాట్లాడడం లేదు.

• • •

## A FACT FINDING REPORT ON MANIPUR AGITATION

హింస పరిమాణంలో మణిపూర్‌లోని పోరాట సంస్థలు త్రిపుర, బోడో సంస్థలతో పోలికకు రావు. తమ పట్టుదలతో భారత ప్రభుత్వాన్ని చర్చలకు లాగిన మొండితనంలో నాగా సంస్థలతో పోలికకు రావు. అయితే సంఖ్యరీత్యా ఎక్కువ సంస్థలు మణిపూర్‌కు చెందినవే. 'పోటా'లో టెర్రరిస్టు సంస్థలుగా పేర్కొన్న పది ఈశాన్య భారత సంస్థలలో ఆరు మణిపూర్‌కు చెందినవే. వాటిలో ఒకటయిన యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ మొత్తం ఈశాన్య భారతంలోని మిలిటెంట్ సంస్థలన్నిటిలోకీ సుశిక్షితమైనదిగా పేరు పొందింది.

ఈ పోరాట సంస్థలకు ఏం కావాలి?
అవి దేనికోసం పోరాడుతున్నాయి?

ఈ నివేదిక ఆ నేపథ్యం గురించే.

